Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు
# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 146 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 10 - 1 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## లోయలో పడిన టూరిస్టు బస్సు.. 8 మంది మృతి



**సిమ్లా:** హిమాచల్ ప్రదేశ్‌లోని సిర్మౌర్ జిల్లాలో భారీ రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేటు బస్సు లోయలో పడి 8 మంది ప్రయాణికులు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కుప్వి నుంచి సిమ్లాకు బస్సు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 30 నుంచి 35 మంది ప్రయాణిస్తున్నట్టు తెలుస్తోంది. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం హరిపుర్ధార్ ఏరియాలోని ఇరుకైన రహదారిపై వెళ్తుండగా బస్సు అదుపు తప్పి లోయలో పడింది. సహాయక కార్యక్రమాలు చేపట్టినట్టు సిర్మౌర్ ఎస్పీ నిశ్చింత్ సింగ్ నెగి తెలిపారు. తొలుత ప్రమాద స్థలికి చేరుకున్న స్థానికులు అత్యవసర సహాయక బృందాలు అక్కడికి చేరుకోకముందే సహాయక చర్యలు చేపట్టారు. పలువురు క్షతగాత్రలను సమీప ఆసుపత్రులకు, మరికొందరికి సీరియస్‌గా ఉండటంతో హెయర్ మెడికల్ సెంటర్లకు తరలిస్తున్నట్టు నిశ్చింత్ సింగ్ చెప్పారు. కాగా, ఈ ఘటనపై ముఖ్య మంత్రి సుఖేందర్ సింగ్ సుఖు విచారం వ్యక్తం చేశారు. బాధితులకు అన్ని రకాలుగా సహాయం అందించాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలిచ్చినట్టు చెప్పారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలోవాలని ఆశిస్తున్నట్టు చెప్పారు.

## పాసు పుస్తకాల పంపిణీలో నిర్లక్ష్యం.. అధికారులపై సీఎం చంద్రబాబు ఆగ్రహం



**రాజమహేంద్రవరం, (రాజధాని వార్తలు):** పాసు పుస్తకాల పంపిణీలో నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారానికి సంబంధించి అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పాసు పుస్తకాలు తీసుకున్న రైతు లంతా సభకు రాకపోవటంపై కలెక్టర్, రెవెన్యూశాఖ అధికారులపై సీఎం మండిపడ్డారు. ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టాదారు పాసు పుస్తకాల పం పిణీలో పారదర్శకత ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**చేసి చూపించాం...**

'మీ భూమి మీద హక్కు' ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాల పంపీణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'మీ భూమి – మీ హక్కు'... చేసి చూపించామన్నారు. రైతులకు ఎప్పుడూ అన్యాయం జరగకూడదని అన్నారు. కరోనా సమయంలోనూ పనిచేసి రైతులు అందరికీ అన్నం పెట్టారని గుర్తు చేశారు. ఏపీలో 6,680 ఎకరాల్లో రీ సర్వే చేశామని.. 22.30 లక్షల పాస్ పుస్తకాలు సిద్ధం చేశామని చెప్పారు.

**వారి ఆలోచనలు ప్రమాదకరం...**

గత ప్రభుత్వ నేతలవి ప్రమాదకరమైన ఆలోచనలని మండిపడ్డారు చంద్రబాబు. రైతుల భూమి పత్రాలపై జగన్ ఫొటో ఎందుకు వేశారో అర్థం కాలేదని విమర్శించారు. గతంలో పట్టాదారు పాసు పుస్తకాలకు జగన్ ఫొటో పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కూటమి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని తెలిపారు. ఈ పట్టాదారు పాసు పుస్తకాన్ని ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని తెలిపారు. ఎవరైనా ట్యాంపరింగ్ చేస్తే గుర్తించి శిక్షించే పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## ఆమె కారణంగానే రాజకీయాల్లోకి వచ్చా : వెంకయ్యనాయుడు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** భారతీయ సంస్కృతిని కాపాడుకోవాలని.. భారతీయ వంటలు అందరూ తినాలని దేశ ప్రజలకు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. సంక్రాంతి పండగ అంటే తనకు చాలా ఇష్టమన్నారు. విశాఖపట్నంపై తనకు ఎంతో ప్రేమ ఉందని చెప్పారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన సంక్రాంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. తాను ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థినని గుర్తు చేసుకున్నారు. ఇక్కడ జరుగు తున్న సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. విద్యార్థి దశలో ఎన్నో పోరాటాలు చేశానని.. జైలుకు సైతం వెళ్లానని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీకి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఆమె కారణంగానే తాను రాజకీయాల్లోకి వచ్చానని వివరించారు. స్వతంత్ర భారతదే శంలో ఆత్మ నిర్భర భారత్ కోసం అందరూ కృషి చేయాలని వెంకయ్య నాయుడు ఆకాంక్షించారు. ప్రపంచంలో నాలుగో వంతు జీడీపీ భారతదేశానిదేనని పేర్కొన్నారు. పశు సంపద ఎంత బాగుంటే జాతీయ సంపద కూడా అంత బాగుంటుందన్నారు. ఆత్మ నిర్భర భారత్ ముందు.. ఎవరు ఎన్ని సుంకాలు వేసినా ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. అందుకే ఆత్మ నిర్భర భారత్ అని ప్రధాని నరేంద్ర మోదీ అంటున్నారని వివరించారు. తాను రైతు బిడ్డగా పుట్టానని.. అందుకే రైతులు అంటే తనకు చాలా అభిమానమన్నారు. తెలుగు రైతుల పండగ సంక్రాంతి.. తెలుగు వారి లోగిళ్లలో ఇది పెద్ద పండగని వెంకయ్యనాయుడు అభివర్ణించారు. ఫల సాయాన్ని అందించే వ్యవసాయాన్ని ఎప్పుడూ మర్చిపోకూడని ప్రజలకు ఆయన హితవు పలికారు. అలాగే జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్య నేర్పిన గురువులను, మాతృభాషను మర్చిపోకూడదని చెప్పారు. ప్రజలకు అర్థమయ్యే భాషలో పరిపాలన చేయాలంటూ ప్రభుత్వాలకు ఆయన సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు నేర్పించాలంటూ ఈ సందర్భంగా తల్లిదండ్రులకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కీలక సూచన చేశారు.

## శబరిమల బంగారం చోరీ కేసు.. ప్రధాన పూజారి అరెస్టు

**తిరువనంతపురం, (రాజధాని వార్తలు):** సంచలనం సృష్టించిన శబరిమల బంగారం చోరీలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆలయ ప్రధాన అర్చకుడు కందరారు రాజీవరును ప్రత్యేక విచారణ బృందం శుక్రవారం నాడు అరెస్టు చేసింది. సిట్ కార్యాలయంలో తెల్లవారుజామున 4.30 గంటల నుంచి సుమారు రెండు గంటలసేపు ఆయనను ప్రశ్నించినట్టు తెలుస్తోంది. అనంతరం అరెస్టు చేసినట్టు సిట్ అధికారికంగా ప్రకటించింది. ఆయనను కొల్లంలోని కోర్టుకు హాజరు పరుస్తున్నారు. రాజీవరుతో కలిపి ఈ కేసులో ఇంతవరకూ అరెస్టయిన వారి సంఖ్య 11కు చేరింది. ఈ కేసులో ప్రదాన నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టితో రాజీవరుకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్టు సిట్ అధికారులు గుర్తించారు. బంగారం తాపడాల చోరీ కేసులో ఆయన పాత్ర ఉన్నట్టు విచారణలో తేలడంతో తాజా అరెస్టు జరిగినట్టు తెలుస్తోంది. ఉన్నికృష్ణన్ పొట్టిని శబరిమల కాంట్రాక్టుకు తీసుకువచ్చింది రాజీవరేనని ఈ కేసులో అరెస్టయిన దేవస్థానం బోర్డు మాజీ ప్రెసిడెంట్ ఎ.పద్మకుమార్ తదితరులు వాంగ్మూలం ఇచ్చినట్టు సిట్ అధికారులు తెలిపారు. దీంతో సిట్ కార్యాలయానికి రాజీవరును రప్పించి విచారణ అనంతరం అరెస్టు చేసినట్టు చెప్పారు.

**ఏమిటీ కేసు..**




2019లో శబరిమల ద్వారపాలక విగ్రహాలు, శ్రీకోవిలి తలుపులపై ఉన్న బంగారు తాపడం తొలగించి మళ్లీ తాపడం చేశారు. అయితే ముందు ఉన్న దానితో బరువులో వ్యత్యాసం వచ్చినట్టు ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఆరోపణలు తీవ్రం కావడంతో దర్యాప్తును సిట్‌కు కేరళ ప్రభుత్వం అప్పగించింది. బెంగళూరుకు చెందిన ఉన్నికృష్ణన్ ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్నట్టు సిట్ చెబుతోంది. బెంగ ళూరులోని ఓ దుకాణం నుంచి బంగారాన్ని రికవరీ చేసుకోవడంతో కేసులో పలువురుని అదుపులోకి తీసుకోవడం జరిగింది. ఈడీ సైతం మనీలాండరింగ్ కింద సీబీఐ అరెస్టు చేసిన నిందితులపై అభియోగాలు నమోదు చేసింది.

## వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో గ్రామీణ భారతానిది కీలక పాత్ర : ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

### - గ్రామీణ జీవనోపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి 'వీబీ - జీ రామ్ జీ' దోహదం
### - విజయనగరంలో పాత్రికేయుల కోసం పీ.ఐ.బీ విజయవాడ 'వార్తాలాప్' నిర్వహణ









**విజయనగరం, (రాజధాని వార్తలు):** వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను చేరుకోవడంలో గ్రామాలను భాగస్వామ్యం చేసేందుకు కొత్తగా తెచ్చిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ గ్రామీణ్'ఎంతో దోహదపడుతుందని విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. విజయనగరంలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (విజయవాడ) నిర్వహించిన మీడియా వర్క్‌షాప్ 'వార్తాలాప్'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాల సాధనకు ఈ చట్టం ఒక సమగ్ర మార్గమని ఆయన పేర్కొన్నారు. నూతన చట్టం ద్వారా ఒక ఆర్థిక ఏడాదిలో పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచడం అతిపెద్ద మార్పు అని అన్నారు. వీబీ జీ రామ్ జీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తుల కల్పన, స్థానికులకు జీవనోపాధి కల్పించడంపై దృష్టి పెడుతుందని వివరించారు. ఈ పథకం నిజమైన లబ్ధిదారులకు చేరాలంటే మీడియా ద్వారా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని పాత్రికేయులను ఎంపీ అప్పలనాయుడు కోరారు. పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) విజయవాడ, డైరెక్టర్ జి.సురేష్ కుమార్ వార్తాలాప్ ఉద్దేశాలను వివరిస్తూ, ఈ పథకంలో ఎన్నో సానుకూల అంశాలు ఉన్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి, మీడియాకు మధ్య వారధిగా పీఐబీ పనిచేస్తోందని తెలిపారు. పని దినాల పెంపు, వ్యవసాయ సమయంలో ఇచ్చే జీవనోపాధి సెలవు వంటి అంశాలు లబ్ధిదారులకు, రైతులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ వై.వి.కె.షణ్ముఖ కుమార్ ఈ పథకంపై జిల్లా పాత్రికేయులకు సమగ్రమైన అవగాహన కల్పించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం అమలులో ఉత్తమ పనితీరు కనబరుస్తున్న జిల్లాల్లో విజయనగరం ముందుందని వెల్లడించారు. కేవలం ఉపాధి కల్పన మాత్రమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తుల కల్పనపై ఇప్పుడు ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. లబ్ధిదారుల ఆదాయం పెంచటమే కాకుండా, అవినీతిని కట్టడి చేసేందుకు కృత్రిమ మేధ, జీపీఎస్ ఆధారిత జియో–ట్యాగింగ్ వంటి అధునాతన సాంకేతికతలను వినియోగిస్తున్నట్టు వివరించారు. ఈ వార్తాలాప్ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ పాత్రికేయులు విజయనగరం వంటి వెనుకబడిన జిల్లాల నుంచి వలసలను అరికట్టడానికి పలు సూచనలు చేశారు. పంచాయతీ రాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ..గ్రామ పంచాయతీల మధ్య వనరుల పంపిణీలో అసమానతలు లేకుండా చట్టంలో నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ఈ నూతన చట్టం కారణంగా ఇకపై వారానికోసారి చెల్లింపులు జరుగుతాయని, పని కల్పించడంలో విఫలమైతే నిరుద్యోగ భృతి తప్పనిసరి అని తెలిపారు. నీటి భద్రత, గ్రామీణ మౌలిక సదుపాయాలు, విపత్తు సన్నద్ధత వంటి అంశాలకు ఈ పథకంలో ప్రాధాన్యత ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్, లీడ్ బ్యాంక్ అధికారులు వి.వి. రమణమూర్తి, అనిల్, డ్వామా పీడీ శారదాదేవి పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా పెద పోలమాంబ అంపకోత్సవం



**మక్కువ, (రాజధాని వార్తలు):** ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన శ్రీ శంబర పోలమాంబ అమ్మవారి మేనత్త పెద పోలమాంబ అనుపోత్సవము బుధవారం ఘనము గా జరిగింది. బంగారు రంగు పూతతో అలంకరించిన ఘటాలుతో మంగళవారం రాత్రంతా గ్రామములో తిరువీధి నిర్వహించగా బుధవారం ఉదయం యాత్రా స్థలానికి అమ్మవారి ఘటాలు చేరుకున్నాయి. యాత్ర స్థలం వద్ద అమ్మవారి ఘటాలకు ఉయ్యాల కంబాల నిర్వహించారు. అనంతరం భక్తుల కోలాహాలు, మంగళ వాయిద్యాలు, భాజా భాజంత్రీల మధ్య అమ్మవారి గుడికి పెద పోలమాంబ అమ్మవారి ఘటాలను తీసుకెళ్లి పోలమాంబ వద్ద ఉంచారు. బుధవారం చిన్న పోలమాంబ అమ్మవారిని గ్రామములోకి తీసుకొని వచ్చేందుకు సనప చాటింపు వేయించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ నైదాన తిరుపతిరావు, ఆలయ ఈ ఓ బి. శ్రీనివాస్, ఎంపీటీసీ తీల్ల పోలినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, భక్తులు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ విద్య పాఠశాలను సందర్శించిన జె డి లక్ష్మీనారాయణ




**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం పట్టణంలో ఉన్న శ్రీ విద్య పాఠశాలను రిటైర్డ్ ఐపిఎస్ అధికారి, జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జె.డి. లక్ష్మీ నారాయణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల సీఈఓ చైతన్య కృష్ణ శాలువతో సన్మానించారు. అనంతరం జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చదువులో అందరు రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి అని అన్నారు. చదువుతో పాటు దేశ సేవలో ముందు ఉండాలని, సమాజంలో మంచి వ్యక్తులుగా ఎదగాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు కంభంపాటి సురేష్, ఆడుసుమిల్లి జగదీశ్, శ్రీ విద్య పాఠశాల ప్రిన్సిపాల్ హన్సి, జోనల్ ఇంచార్జి సాయి కృష్ణ, ఎజి ఏం రవీంద్ర నాథ్, జెసప్ప, అలీమ్ ఖాన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# కొత్తబగ్గాములో "రైతు క్షత్ర పాఠశాల"

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని కొత్తబగ్గాము గ్రామంలో వ్యవసాయ అధికారులు "రైతు క్షత్ర పాఠశాల" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి గోవిందమ్మ మాట్లాడుతూ, రైతును శాస్త్రవేత్తగా తీర్చిదిద్దాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. రైతులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వరి పంటలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించుట, మిత్ర పురుగులు సంరక్షణ, శత్రు పురుగుల నివారణ, నాణ్యమైన పంట వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్.కిరణ్ కుమార్, వ్యవసాయ సిబ్బంది,




రైతులు పాల్గొన్నారు.

# సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరవాలి

## - విజయనగరం డివిజన్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసు

**మెంటాడ, (రాజధాని వార్తలు):** పది సంవత్సరాలలోపు ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను తెరిచే విధంగా సిబ్బంది కృషి చేయాలని విజయనగరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసు అన్నారు. గురువారం స్థానిక సబ్ పోస్ట్ ఆఫీసు ను వార్షిక తనిఖీలో భాగంగా ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్ట్ ఆఫీసు పథకాలను ప్రజలకు వివరించి, వినియోగించుకునే విధంగా ప్రచారం చేయాలని కోరారు. సుకన్య మహోత్సవ్ మేళాను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ పోస్ట్ మాస్టర్ పి.సాయి కృష్ణ, బి.పి.యంలు, ఎ.బి.పి.యంలు పాల్గొన్నారు.



# పారిశ్రామిక వృద్ధికి కృషి చేయండి : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ ప్రాధాన్యత పథ కాలు, పారిశ్రామికాభివృద్ధి మరియు పౌర సేవలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పారిశ్రామిక పురోగతిని వేగవంతం చేయడంతో పాటు, ప్రభుత్వ పాలనపై ప్రజల్లో సానుకూల దృక్పథన్ని పెంపొందించడమే లక్ష్యంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశం జరిగింది. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 175 ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఇంకా పనులు ప్రారంభం కావాల్సి ఉన్న 75 పార్కులపై సీఎస్ ప్రత్యేక దృష్టి సారించారు. వీటికి సంబంధించిన భూసేకరణ మరియు మౌలిక సదుపాయాల కల్పనను త్వరితగతిన పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా పనులు ప్రారంభించాలని, దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన అధికారులను ఆదేశించారు. భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న పెట్టుబడుల ఒప్పందాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని, పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేస్తూ పెట్టుబడిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశాలను క్రమం తప్ప కుండా నిర్వహించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, ప్రజలకు అందుతున్న సేవల్లో పారదర్శకత ఉండాలని, సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా పౌర సేవలపై సానుకూల అభిప్రాయం పెంపొందించేలా పని చేయాలని ఆదేశించారు. 'ఏజెంట్ స్పేస్'కు సంబంధించిన డాక్యుమెంట్ అప్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని డిజిటల్ సేవల విభాగం అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ కార్యక్రమాల పురోగతిని వివరించగా, జెసి సేధు మాధవన్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కొత్త రోడ్డు వద్ద గల డంపింగ్ యార్డులో సుడిగాలి పర్యటన చేపట్టిన ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దక్షిణ నియోజ కవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ కొత్త రోడ్డు వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌లో సుడిగాలి పర్యటన నిర్వహించారు. డంపింగ్ యార్డ్‌లో నిల్వ ఉన్న చెత్త, దుర్వాసనపై స్థానిక సిబ్బం దిని అడిగి తెలుసుకున్నారు. గత కొన్ని రోజులుగా డంపింగ్ యార్డ్‌లో చెత్త నిల్వకు గల కారణాల గూర్చి ఆరా తీశారు. నీ ళ్లు చల్లక పోవడంతో దుమ్ము ధూళి వలన చుట్టుపక్కల ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావడంతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి స్థానిక ప్రజలు తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు. కార్యక్రమంలో అధికారుల నుంచి సరైన సమాధానం లేకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశా రు. పరిసరాలలో దుర్వాసన రావడంతో ప్రజల యొక్క ఆరోగ్య పరిస్థితిని కనీసం బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్న అధికారులు తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ నుంచి వెహికల్స్ ఉన్నప్పటికీ చెత్త తరలించడంలో అలసత్వం వహిస్తున్న సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# వైయస్సార్సీపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా నూకవరపు మైకేల్ రాజు నియామకం

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వైయస్సార్సీపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా నూకవరపు మైకేల్ రాజును పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి అధికారిక ఉత్తర్వులు విడుదలయ్యాయి. 41వ వార్డు పార్టీ అధ్యక్షునిగా విశిష్ట సేవలు అందించిన మైకేల్ రాజు, సౌమ్యుడిగా, కులాలకు అతీతంగా పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తూ అందరి మన్ననలను పొందారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన ఆయన సేవలను గుర్తించిన అధిష్టానం, పార్టీలో ఆయనకు ఉన్నత బాధ్యతను అప్పగించింది. మైకేల్ రాజు నియామకంపై పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా మైకేల్ రాజు మాట్లాడుతూ తనపై అధిష్టానం ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, అందరినీ సమన్వయం చేస్తూ పార్టీ బలోపేతానికి నిరంతరం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి సముచిత స్థానాన్ని కల్పించిన పార్టీ అధ్యక్షలు వైయస్ జగన్మోహన్ రెడ్డి, దక్షణ నియోజకవర్గ ఇన్చార్జి వాసుపల్లి గణేష్ కుమార్‌కి మైకేల్ రాజు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.



# కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయంలో వైభవంగా సంక్రాంతి వేడుకలు





**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయంలో సంక్రాంతి పండుగను వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.వెంకట్రావు నాయకత్వంలో జరిగిన ఈ సంక్రాంతి సంబరాలు ఉద్యోగులను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయం మొత్తం పండుగ శోభను సంతరించుకుంది. కార్యాలయ ప్రాంగణాన్ని గాలిపటాలతో ఆకర్షణీయంగా అలంకరించగా, ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగులు వేసిన రంగురంగుల రంగోలీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేషన్ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి.సత్యనారాయణ భోగి మంటలు వేసి సంక్రాంతి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ భారతీయ సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించే మహత్తర పండుగ అని పేర్కొన్నారు. ఉద్యోగుల మధ్య స్నేహభావం, ఐక్యతను పెంపొందించేలా ఇలాంటి వేడుకలు నిర్వహించడం ఆనందకరమని తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయ ఉద్యోగులంతా పాల్గొనే విధంగా సోమవారం కార్పొరేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఉద్యోగులంతా సాంప్రదాయ పంచకట్టులో వేడుకలకు హాజరై పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహంగా మార్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీ చరణ్, టీపీఆర్ఓ శైలజ, ఈఈలు కనకారావు, డీఈ లక్ష్మీనారాయణతో పాటు స్మార్ట్ సిటీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీనియర్ డెస్క్ జర్నలిస్ట్ కిషోర్ మృతికి సంతాపం

## - తక్షణ ఆర్థిక సహాయం అందజేత - అండగా ఉంటామని భరోసా



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రభ జాతీయ దినపత్రికలో సుదీర్ఘకాలంగా (2008) డెస్క్ జర్నలిస్టుగా కొన సాగుతున్న పి కిషోర్ బుధవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెం దారు. ప్రస్తుతం ఆయన శ్రీకాకుళం జిల్లా డెస్క్ ఇన్చార్జిగా వ్యవహ రిస్తున్నారు. ఈనెల రెండో తేదీ నుంచి ఆయన అస్వస్థతతో అనారోగ్యానికి గురయ్యారు. అనుకోకుండా ఆకస్మికంగా మృతి చెందారు. కిషోర్‌కు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. విజయనగరం రైల్వే స్టేషన్ సమీపంలో ఆయన నివాసం ఉం టున్నారు. కిషోర్ ఆకస్మిక మరణం పట్ల ఆంధ్రప్రభ గ్రూపు సంస్థల జనరల్ మేనేజర్ గంజి వెంకటేశ్వర్లు రీజనల్ కోఆర్డినేటర్ ఉమ్మడి విశాఖ బ్యూరో చీఫ్ గంట్ల శ్రీనుబాబు అసిస్టెంట్ మేనేజర్ సి హెచ్ దేవుడు నాయుడు అకౌంట్స్ విభాగం ఇంచార్జ్ ఉదయ్ డస్క్ జర్నలిస్టులు ఉత్తరాంధ్ర జిల్లాల ఆంధ్రప్రభ కుటుంబ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు కిషోర్ పార్థివ దేహాన్ని విజయనగరంలో ఆయన నివాసంలో ఉంచగా గంట్ల శ్రీనుబాబు, దేవుడు నాయుడు, పి.నగేష్ బాబు, కింతాడ మదన్, వంటాకుల శ్రీనివాస్ తదితరులంతా పరామర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడు తూ కిశోర్ కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే కిషోర్ కుటుంబ సభ్యులకు తక్షణ ఆర్థిక సహాయం అందించారు. భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని చెప్పారు.

# శాస్త్రీయ పద్ధతులలో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించండి

**- సోలార్ ట్రాప్స్ వాడకం ద్వారా పంటలను ఆశించే తెగుళ్ల నుంచి రక్షణ పొందొచ్చు**

**- రైతులకు ఉచితంగా సూక్ష్మ పోషకాలు అందించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి రైతులకు సూచించారు. కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలో ఆమె వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటలకు సూక్ష్మ పోషకాలు అందించే స్ప్రే జింక్, రా జింక్ మరియు పంట పొలాలలో ఎలుకలను నివారించే బ్రోమో డైలూం ప్యాకెట్లు మరియు సోలార్ ట్రాప్స్ పరికరాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వ్యవసాయ విధానాలకు సంబంధించి అధికారులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ పంట పొలాలలో తెగుళ్ళ నివారించేందుకు వాడే పురుగు మందుల విషయంలో వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటించాలని సూచించారు. సోలార్ ట్రాప్స్ వాడకం ద్వారా పంటలను ఆశించే చీడ పురుగుల వివరాలు తెలుస్తాయని దానివల్ల పంటకు వచ్చే తెగుళ్ల గురించి ముందుగానే తెలుసుకోవచ్చన్నారు. శాస్త్రీయ పద్ధతులలో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెన్నాడెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాలం రెడ్డి, అగ్రికల్చర్ డైరెక్టర్ అనిత, ఏఓ రజని, పెన్నా డెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాలరెడ్డి, ఎంపీపీ తుమ్మల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య భద్రత దిశగా కార్పొరేటర్ పోట్లూరి రామకృష్ణ చర్యలు

**పురపాలక మరియు పట్టణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ ఆదేశాలతో..**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని 47వ డివిజన్, కామాటి వీధి సంతాన బాల గోపాలకృష్ణ మందిరం సందులో ఉన్న ఖాళీ స్థలంలో చెట్లు, చెత్త విపరీతంగా పెరిగిపోవడంతో చుట్టుపక్కల నివాసితులు కార్పొరేటర్ పోట్లూరి రామకృష్ణకి ఈ విషయాన్ని తెలియజేశారు. ప్రజల సమస్యపై వెంటనే స్పందించిన కార్పొరేటర్ రామకృష్ణ మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి మేస్త్రి విజయ్ శేఖర్ చెప్పి ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించి శుభ్రత కార్యక్రమం చేపట్టడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ వేయించడం జరిగింది. ఈ చర్యతో స్థానికులకు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా నివారించడంతో పాటు పరిసర ప్రాంతం పరిశుభ్రంగా మారిందని స్థానికులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ రెహమాన్, బిఎల్‌సిఆర్మాట్ శీను, జహూర్ అహ్మద్, సెక్రెటరీ దువ్వూరు నరేంద్ర, ఐటిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ మహంకాళి సురేంద్ర, టి.చంద్ర, వి.కృష్ణ, ఆనంద్ మరియు సానికులు పాల్గొన్నారు.

# వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసిన పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి

**- ఈ సందర్భంగా ఎంఎల్‌సి చంద్రశేఖర్ రెడ్డితో జగన్మోహనరెడ్డి పలు విషయాలు చర్చించారు**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డిని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కలిసి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డితో పలు విషయాలు చర్చించి కొన్ని సూచనలు చేశారు.

# వైయస్సార్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రతినిధులతో వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన చంద్రశేఖర్ రెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వైఎస్ఆర్‌టిఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ట్రెజరర్‌లతో కలిసి వైయస్ జగన్మోహన్ రెడ్డిని పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కలిశారు.



ఈ సందర్భంగా వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ డైరీ మరియు క్యాలెండర్లను వైయస్ జగన్మోహన్ రెడ్డితో కలిసి ఆవిష్కరించడం జరిగినది.

# మహిళలు వరకట్నం, వేధింపులు, ఇబ్బందులు పెడితే సమాచారం ఇవ్వండి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఎవరైనా వరకట్నం గురించి వారి స్వార్థం కోసం అన్యాయంగా ఉపయోగించుకోవడం, వేధింపులు మరియు తీవ్ర ఇబ్బందులకు పెట్టడం వంటివి సంబంధిత అధికారులు తమ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే వాటిని సంబంధిత పోలీస్ సూపరింటెండెంట్‌తో చర్చించి పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయములోని కలెక్టర్ వారి చాంబర్‌లో వరకట్న నిరోధక చట్టం -1961 అమలుపై జిల్లా స్థాయి సలహా సంఘ సమావేశం జిల్లా మహిళా శిశు అభివృద్ధి ఏజేన్సి ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఐ.సి.డి.యస్ శాఖ వారు వైద్య ఆరోగ్య శాఖ వారితో సమన్వయ పరచుకోవాలన్నారు. ఎక్కడైనా బలవంతపు వివాహాలు, వరకట్న వేధింపులు జరుగుతున్నట్లు కమిటి మెంబర్ల దృష్టికి వచ్చినట్లయితే వాటిని కమిటి దృష్టికి తీసుకోవచ్చి నిరోధించాలన్నారు. వివాహ సమయంలో వధూ వరులకు వరకట్న నోరోధక చట్టం -1961పై అవగాహన కల్పించాలన్నారు. సహజంగా సమాజములో వివాహాలు అయిన పిదప ఇటువంటి సంఘటనలు జరుగుతుంటాయని, వాటిని నిరోధించే విధగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశములో ఐ.సి.డియస్. పి.డి, హేమా సుజన్, హైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సురేష్, స్వచంద సంస్థల ప్రతినిధిలు బషీర్ తదితరులు పాల్గొన్నారు.



# కారుణ్య నియామకాలతో ఐదుగురికి ఉద్యోగావకాశాలు

**- నియామక ఉత్తర్వులను అందించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** చిత్తశుద్ధి, అంకితభావంతో విధులను నిర్వర్తించి తమ శాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. గురువారం తన ఛాంబర్ నందు ఏపీఎస్‌ఆర్టీసీలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం ద్వారా ఐదుగురికి వివిధ శాఖల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తూ ఆయన నియామక ఉత్తర్వులను అందించారు. యు.చంద్రన, తండ్రి: లేట్ యు. విజయకుమార్, డ్రైవర్, ఏపీఎస్‌ఆర్టీసీ ఉ మహిళా పోలీస్‌గా నియమిస్తూ.. పోలీస్ శాఖకు, కె.సుస్మిత, భర్త: లేట్ ఎన్. శ్రీనివాసులు రెడ్డి, మెకానిక్, ఏపీఎస్‌ఆర్టీసీ - ఆఫీస్ సబార్డినేట్‌గా నియమిస్తూ పశుసంవర్ధక శాఖకు, వై. కావ్య, తండ్రి: లేట్ వై. శ్రీనివాసరావు, కండక్టర్, ఏపీఎస్‌ఆర్టీసీ - డిజిటల్ అసిస్టెంట్‌గా నియమిస్తూ.. పంచాయతీ రాజ్ శాఖకు, ఎస్. జయరామ్ మనోజ్, తండ్రి: లేట్ ఎస్.వెంకటేశ్వరరావు, ఎలక్ట్రీషియన్, ఏపీఎస్‌ఆర్టీసీ ఉ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2గా నియమిస్తూ పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖకు, ఎస్‌కే. అబూబకర్ సిద్దిక్, తండ్రి: లేట్ ఎస్‌కే. రసూల్ అహ్మద్, కండక్టర్, ఏపీఎస్‌ఆర్టీసీ- గ్రామ రెవెన్యూ అధికారి (గ్రేడ్-2)గా నియమిస్తూ రెవెన్యూ శాఖకు కేటాయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ, మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ కారుణ్య నియామకాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతోందని తెలిపారు. నియామకాలు పొందిన అభ్యర్థులు విధులను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు.

# మంత్రి ప్రగడ సత్రం ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్‌గా మేడిశెట్టి ఈశ్వర రావు (చిన్ని) కలిసి శుభాకాంక్షలు తెలిపిన యనమదల రవి



**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా కాకినాడ మంత్రి ప్రగడ వారి సత్రం ట్రస్ట్ పోర్టు ఛైర్మన్‌గా నియమితులైనటువంటి మేడిశెట్టి ఈశ్వరరావు చిన్ని కలిసి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా యనమదల రవి మాట్లాడుతూ కష్టపడే వారికి గుర్తింపు ఈ పదవిని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు ఈశ్వరరావుకి సాధించాలని ఈ పదవినిచ్చిన కాకినాడ శాసన సభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు కొండబాబుకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంకే రాజు కొప్పిశెట్టి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## బహుళ భారత్‌లు - అనేక అంతర్యాలు

ఏ మనిషి అయినా ప్రాథమిక అవసరాలు తీరిన తరువాత గుర్తింపు, గౌరవం కోసం ఆరాటపడతాడు. వ్యక్తులలోను, సమాజాలలోను ఈ ఆరాటం ఉంటుంది. అయితే, నిర్దిష్ట సంస్కృతులు, భాషలకు సంబంధించిన వారు తమ తమ భాషా సంస్కృతుల గుర్తింపు, గౌరవం కోసం పడుతున్న ఆరాటం అపార వైవిధ్యమున్న మన సమాజంలో తరచూ వక్రగతిలో వ్యక్తమవుతోంది. నేను చూసిన ఒక వీడియోలో ఒక వ్యక్తిని మరాఠీ భాష మాట్లాడి తీరాలని ఒక యువతి నిక్కచ్చిగా చెబుతోంది. తాను హిందీ మాత్రమే మాట్లాడగలనని, మనం భారతదేశంలో ఉన్నాం కనుక మనమందరమూ హిందీలో మాట్లాడుకోవాలని ఆ 'ఇతర' వ్యక్తి సమాధానమిచ్చాడు. ఇరువురి మధ్య వాద ప్రతివాదాలు ప్రారంభమయ్యాయి. అంతిమంగా వారిరువురి వాగ్యుద్ధం ఆంగ్లభాషలో కొనసాగింది! ఆ మరాఠీ యువతి, హిందీ భాషీయుడి మధ్య మాటల యుద్ధం సమంజసమైనదేనా? మరో వీడియోలో ఒక మహిళ మరొక మహిళను హిందీలో చీవాట్లు పెడుతోంది. బాధితురాలు అయిన మహిళ బురఖాలో ఉంది. తనపై హిందీలో వర్షిస్తున్న తిట్లకు ఆమె కన్నడంలో ప్రతిస్పందిస్తోంది. ఇరువురూ బిగ్గరగా మాట్లాడుతున్నారు. జెండర్ భాగస్వామ్యం ఆ మహిళల మధ్య ఎలాంటి ప్రత్యేక బంధనాన్ని సృష్టించలేదు. భాషా దురభిమానం బరువు కింద ఆ సహజ బంధం పనికిరాకుండాపోయింది. తమ భాషను గుర్తించి, గౌరవించాలని ఎవరైనా కోరుకోవడం సహజం. అయితే ఆ ఆరాటం ఇతరులను బలవంతం చేసేందుకు పురిగొల్పకూడదు. అలా చేయడం ఇతరుల హక్కులను కాలరాయడమే. తమ నమ్మకాలు, విలువలు, అభ్యాసాలనే ఇతరులూ విశ్వసించాలని, అనుసరించాలని కోరుకోవడమే తప్పు. పైగా వాటిని ఇతరులపై రుద్దడానికి ప్రయత్నించడం నాగరీక సంస్కారానికి విరుద్ధం. అయినా నేటి సమాజంలో చాలామంది అటువంటి సంకుచితత్వాలను వదులుకోలేకున్నారు. అసలు అవి సంకుచితత్వాలనే వివేకం కూడా చాలామందికి లేదు. కాకపోతే హిందీ, కన్నడ భాషల్లో పరస్పరం అరుచుకున్న మహిళలు ఇరువురూ తాము నివసిస్తున్న పితృస్వామ్య వ్యవస్థ విసురుతున్న సవాళ్లను సమష్టిగా ఎదుర్కోవడంపై అలక్ష్యం చూపడం సబబేనా? మానవ ప్రవర్తన విచిత్రమైనది. ఇతర ప్రాంతాలకు చెందిన సహచరుల నుంచి తమ భాషా సంస్కృతులకు సంపూర్ణ గుర్తింపు గౌరవాన్ని డిమాండ్ చేస్తున్న వారు? ఇతర దేశాలకు చదువు, ఉద్యోగం కోసం వెళ్లినప్పుడు అక్కడి సంస్కృతిని గౌరవిస్తున్నారా? సమాధానం స్పష్టమే. ఈ తరహా విద్యావంతులు విదేశీ సమాజాలలో ఉన్నప్పుడు తమకొక నిర్దిష్టమైన గుర్తింపు, గౌరవాన్ని పొందేందుకు ఎంతగా ఆరాటపడతారో చెప్పనవసరం లేదు. వినడానికి సిద్ధంగా ఉన్నవారికి తమ విలక్షణ అస్తిత్వం గురించి అరుస్తూ మరీ చెబుతారు. నలుగురి మధ్యా అటువంటి ప్రవర్తన ఎబ్బెట్టుగా ఉంటుందనే విషయాన్ని సైతం పట్టించుకోరు. స్వకీయ గుర్తింపునకు ఎందుకంత పవిత్రతను ఆపాదిస్తున్నారు? బహుశా అది ఒక ఆవశ్యక మానసిక ఓదార్పునివ్వడం వల్ల కావచ్చు. అయితే అపార వైవిధ్యమున్న భారతీయ సంస్కృతీ సంప్రదాయాలలో భాగమైన, తమవైన ఉపభాషా సంస్కృతుల మాన్యత విషయమై అంతగా పట్టింపులకు పోవడం ఆశ్చర్యకరం. మన ఆహార అలవాట్లనే చూడండి. మన సువిశాల భారత భూమిలో అన్ని భాషా సంస్కృతుల వారూ, కుల మతాల వారూ చేతులతో తినడం సర్వవ్యాపకంగా ఉన్నది. అయితే ప్రాంతాల వారీగా భిన్న భిన్న రీతుల్లో ఉండడం కద్దు. ఆ మాటకొస్తే ఆహారాన్ని వండుకునే పద్ధతి కూడా చాలా వైవిధ్యంగా ఉంటుంది. ప్రతి భారతీయ కుటుంబమూ పప్పు వండుకోవడం పరిపాటి. అయితే ఈ ప్రధాన ఆహార పదార్థాన్ని సిద్ధం చేసుకునే రీతి రివాజులు ప్రాంతాల వారీగా భిన్నంగా ఉండడంలో ఆశ్చర్యం లేదు. పురాతన యోగా సంప్రదాయాన్నే తీసుకోండి. యోగాభ్యాసంలో అనేక పద్ధతులు ఉన్నాయి. ఒక ప్రాంతంలో ఉన్న పద్ధతులు మరొక ప్రాంతం వారికి కొత్తగా ఉండడం కద్దు. అలాగే స్త్రీల చీరకట్టు. అద్భుతమైన వైవిధ్యమున్న స్త్రీల వస్త్రధారణ ఇది. చీరకట్టు సౌందర్య శోభలో కూడా అందమైన వైవిధ్యం ఉంది. భారతీయులు అందరికీ నోరూరించే పుచ్కా అనే స్ట్రీట్ ఫుడ్ బహుళ రుచులతో ఉంటుంది. గోల్‌గప్పా, జల్‌పూరీ తదితర ప్రాంతీయ నామాలతో సుప్రసిద్ధమైన ఈ స్నాక్‌ను వివిధ ప్రాంతాలవారు వివిధ రీతుల్లో వండుకుంటారు. వైవిధ్యానికి ఉన్న ప్రాధాన్యాన్ని ఒకనాటి మన రాజులు, చక్రవర్తులు గుర్తించినట్టుగా నేడు మనం గుర్తిస్తున్నామా? శివాజీ మహరాజ్ సైన్యంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. మొగల్ చక్రవర్తుల ప్రధాన సైనికాధికారులు అందరూ రాజపుత్ర వీరులే. హిందూ రాజులు జైన, బౌద్ధ మతస్థులకు చేసిన దాన ధర్మాల గురించి ఈనాటికీ మనం చెప్పుకుంటూనే ఉన్నాం. రాజులు, చక్రవర్తులు వాటిని తమ రాజధర్మంలో భాగంగా గుర్తించారు. ప్రజలకు ఆమోదమైన పరిపాలననందించేందుకే వారు ఆ పుణ్య విధులు నిర్వర్తించారు. తమ సువిశాల సామ్రాజ్యాలలో ప్రజలు అందరూ ఒకే భాష మాట్లాడేవారు కాదని, ఒకే మతాన్ని అనుసరించేవారు కాదనే సత్యాన్ని నాటి మన రాజులు, చక్రవర్తులు గుర్తించారు. ఆ వైవిధ్యాన్ని గౌరవించారు, సమున్నతం చేశారు. దానశీలురు అయ్యారు. ఉదారంగా వ్యవహరించారు. బహుళ సంస్కృతీ సంప్రదాయాలను పోషించి పెంపొందించారు. దేశదేశాల సార్థవాహులు ఈ భారత భూమికి వచ్చేందుకు సానుకూల పరిస్థితులు కల్పించారు. అపార వైవిధ్యం అలరారుతుండగా ఒకే విధమైన జీవనరీతులు లేదా సజాతీయతను కీర్తించడం ఎందుకు? సారూప్యతకు స్థిరమైన, సార్వత్రిక నిర్వచనం లేదు. ఒక విషయాన్ని ఏ ఇద్దరు వ్యక్తులూ ఒకే దృక్కోణం నుంచి చూడరు. సజాతీయత సందర్భోచితమైనది, భావోద్వేగమైనది. అది సామాజిక, రాజకీయ శక్తులతో ప్రభావితమవుతుంది.

# విశాఖ వేదికగా ఫిబ్రవరి 23న '9వ మిస్టర్ ఆంధ్ర' బాడీ బిల్డింగ్ పోటీలు





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోని యువతలో శారీరక దృఢత్వం మరియు క్రీడల పట్ల ఆసక్తిని పెంచేందుకు ఏటా నిర్వహించే మిస్టర్ ఆంధ్రా పోటీలు ఈసారి 9వ వసంతంలోకి అడుగుపెట్టాయి. వచ్చే నెల 23న విశాఖలోని గురజాడ కళాక్షేత్రంలో జరగబోయే ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 జిల్లాల నుంచి 400 మంది బాడీ బిల్డర్లు పాల్గొంటారని అని ఏపీ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాడపల్లి శ్రీనివాస్ రాజు తెలిపారు. విశాఖ వేదికగా వచ్చే నెల 23న శివ వైజాగ్ బౌన్సర్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు జరగనున్నాయి దీనికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం బీచ్ రోడ్డులో ఒక ప్రైవేట్ హోటల్లో జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన వాడపల్లి శ్రీనివాస్ రావు, అధ్యక్షులు ఈశ్వరరావులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ గురజాడ కళాక్షేత్రంలో సాయంత్రం 5 గంటల నుండి ఈ పోటీలు ప్రారంభమవుతాయని వారు వెల్లడించారు. ఈ మెగా ఈవెంట్‌లో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొని తమ దేహదారుఢ్యాన్ని ప్రదర్శించనున్నారని తెలిపారు. మొత్తం 10 విభాగాలలో (ఈ పోటీలు నిర్వహించబడతాయి. ప్రతి విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేస్తారు మొదటి బహుమతి రూ. 5,000, ద్వితీయ బహుమతి రూ. 3,000, తృతీయ బహుమతి రూ. 2,000 చొప్పున అందజేస్తారన్నారు..అన్ని విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని 'ఓవరాల్ ఛాంపియన్‌లుగా ఎంపిక అయిన వారికీ మొదటి బహుమతిగా రూ. 1,00,000, (ఒక లక్ష రూపాయలు) రెండవ బహుమతి రూ 50,000, మూడవ బహుమతి: రూ. 25,000 అందజేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణలో అసోసియేషన్ ప్రతినిధులు ఎస్. రాజారావు, బి.కోటిరెడ్డి, ఎస్.బాబి తదితరులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శివ వైజాగ్ బౌన్సర్ ఫౌండర్ శివ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు బాడీ బిల్డింగ్ రంగానికి గుర్తింపు తీసుకు వచ్చేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని ఏపీ వ్యాప్తంగా ఉన్న బాడీ బిల్డర్స్ పాల్గొనాలని క్రీడాభిమానులు అందరూ తరలివచ్చి ఈ పోటీలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా బాడీ బిల్డింగ్ విన్యాసాలు ప్రదర్శించారు.

# అనకాపల్లి జోన్ అభివృద్ధికి ప్రాధాన్యతగా కార్యాచరణ

## - అనకాపల్లి జోన్ సమీక్షా సమావేశంలో వెల్లడించిన జీవీఎంసీ కమిషనర్




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జోన్ అభివృద్ధికి ప్రాధాన్యత దిశగా కార్యాచరణ చేపట్టడం జరుగునని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. గురువారం ఆయన జీవీఎంసీ అనకాపల్లి గుండాల జంక్షన్ వద్ద ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో అనకాపల్లి జోన్ అభివృద్ధి పనులు, సమస్యలపై అనకాపల్లి నియో జకవర్గం శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, అనకాపల్లి జోన్ కార్పొరేటర్లు కొణతాల నీలిమ, మండపాటి సునీత,జాజుల ప్రసన్నలక్ష్మి, మాదంశెట్టి చిన్నతల్లి, జీవీఎంసీ ఉన్నత, విభాగాధికారులు, అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రవర్తిలతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సచివాలయం కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా అనకాపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు మాట్లాడుతూ జీవీఎంసీలో పది జోనులుగా పునర్వ్యవస్థీకరించి వాటి అభివృద్ధి కొరకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టడంతో పాటు ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లతో జోనల్ వారీగా సమీక్షలు నిర్వహించడం అభినందనీయమని, తక్కువ కాలంలో ఎన్నో వినూత్న కార్యక్రమాలను ప్రవేశపెట్టి అవలంబిస్తున్న జివిఎంసి కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ అనకాపల్లి నుండి విశాఖపట్నం చేరుకోవడానికి రెండు గంటలు సమయం పడుతుందని వాహనాలు రాకపోకలు, ప్రజలకు ఇబ్బందులు ప్రమాదాల గురవుతున్నందున రోడ్డు విస్తరణను చేపట్టాలన్నారు. పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థను, తాగునీటి సరఫ రాను మెరుగుపరచాలని, ఎస్‌టిపిని పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచాలని, అంతర్గత కాలువలను ప్రధాన కాలువులకు అనుసం ధానం చేయాలని, కాలువలలో పూడుకతీతలకు అవసరమగు మిషనరీని ఏర్పాటు చేయాలన్నారు. అనకాపల్లికి నాలుగు లక్షల కోట్లు ఇన్వెస్ట్మెంట్స్ వస్తున్నందున శాటిలైట్ టౌన్షిప్‌గా అభివృద్ధి చేయాలన్నారు. అన్ని మౌలిక సదుపాయాలతో రోడ్లు, జంక్షన్లు, వాకింగ్ ట్రాక్‌లు, పిల్లల పార్కులు, నెహ్రూ చౌక్, ప్రముఖులు విగ్రహాల ప్రాంతాలు అభివృద్ధిపరిచి సుందరీకరణ పనులతో అనకాపల్లికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలన్నారు. అనకాపల్లి ఏఎంసీ కాలనీ, అంజయ్య కాలనీ, విలీన ప్రాంతాలలో చాలా ఆస్తులకు దస్తావేజులు లేనందున ప్రత్యేక కార్యాచరణ చేపట్టి పన్నులు విధించే ప్రక్రియ చేపట్టాలన్నారు. క్రీడలకు ప్రాధాన్యత నిస్తూ రాజీవ్ గాంధీ, ఎన్టీఆర్ స్టేడియం, గెస్ట్ హౌస్‌ను అభివృద్ధి పరచాలని, గార్బేజి ట్రాన్స్ఫర్ స్టేషన్, రైతు బజార్, వెండింగ్ జోన్ ఏర్పాటు చేయాలని, అనకాపల్లి ప్రధాన రోడ్డు, రింగ్ రోడ్డు, అంతర్గత రోడ్ల నుండి నేషనల్ హైవే వరకు, నూకంబిక దేవాలయం వరకు రోడ్లను అభివృద్ధిపరచాలన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ అన్ని జోన్లను అభివృద్ధిపరి చేలా ప్రభుత్వ సూచనల మేరకు పది జోన్లుగా పునర్వ్యవస్థీకరణ చేయడం జరిగిందని, అనకాపల్లి జోన్ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక కార్యాచరణ చేపడతామన్నారు. ఈ జోనల్ సమీక్ష సమావేశంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రవర్తి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, డి.సి.ఆర్. ఎస్.శ్రీనివాసరావు, పట్టణ ప్రణాళిక అధికారి మీనా కుమారి, పర్యవేక్షణ ఇంజనీర్లు ఇంజనీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి.నరేష్ కుమార్, ఇంచార్జ్ డి.డి.హెచ్. వాసుకి, పి.డి. యుసిడి సరోజిని, పర్యవేక్షక ఇంజనీర్లు సంపత్ కుమార్, ఏడుకొండలు, గోవిందరావు, కే శ్రీనివాసరావు, పల్లంరాజు, ఎపిడి సంతోష్, సిటీ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ రవికుమార్, సహాయక వైద్యాధికారిని లక్ష్మి తులసి, కార్యనిర్వాహక ఇంజనీర్ శేఖర్, టిడ్కో హౌసింగ్ కార్యనిర్వాహక ఇంజనీర్, ఇతర జివిఎంసి అధికారులు, వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉదారత చాటుకున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

## - వైసీపీ కార్యాలయ హౌస్ కీపింగ్ సిబ్బందికి రూ. 11 వేలు ఆర్థిక సాయం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నం జిల్లా వైసీపీ పార్టీ కార్యాలయ హౌస్ కీపింగ్ సిబ్బందికి పండుగ ఖర్చు లకు గానూ 11,000 /- లు అందజేసి మాజీ ఎమ్మెల్యే, దక్షణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ తన ఉదారత మరోసారి చాటుకున్నారు. దక్షణ పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం జిల్లా పార్టీ కార్యాలయంలో పనిచేస్తున్న కుమార్, స్వర్ణలతలకు సొంత నిధులతో సాయం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర ప్రజలు పెద్ద పండగ అయినా సంక్రాంతి అందరి ఇంట వెలుగులు నింపాలని ఆకాంక్షంచారు. పార్టీ కార్యాలయంలో వైసిపి కుటుంబంలో భాగస్వాములైన హౌస్ కీపింగ్ సిబ్బంది అందిస్తున్న సేవలు కూడా ఎంతో కీలకమన్నారు. పార్టీ శ్రేణు లకు, కార్యాలయానికి అవసరమైన వసతులు కల్పిస్తూ శుభ్రం చేసే కార్మికులు మంచి చెడ్డలు చూడటం తమ బాధ్యత అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు అధ్యక్షతన విశాఖలో సంక్రాంతి సంబరాలు ప్రతి వైసిపి కుటుంబ సభ్యుడుతో పాటు మనకోసం పనిచేసే సిబ్బంది కూడా సంతోషంగా ఆనందంగా జరుపుకోవాలన్నదే తమ ఉద్దే శం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లండ రమణ, అరుగుల రాజు చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

# కావమ్మ పేరంటాలి ఆలయంలో 15 నుంచి తీర్థ ఉత్సవాలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఈ నెల 15వ తేదీ నుండి 21వ తేదీ వరకు పాతివ్రత్యానికి మారుపేరుగా నిలిచిన కావమ్మ పేరంటాలి తీర్థ ఉత్సవాలు వారం రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. గురువారం వారు ఒక ప్రకటనలో తెలుపుతూ సామర్లకోట పట్టణం రజక వీదిని ఆనుకుని ఏలేరు - గోదావరి కాలువల మధ్యలో వేంచేసి ఉన్న శ్రీ కావమ్మ, మారయ్య ఆలయం వద్ద ఈ తీర్థ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఆట సంక్రాంతి పర్వదినాల్లో నిర్వహించే ఈ ఉత్సవాలను సంక్రాంతి పండుగ రోజున ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. 15వ తేదీ ఉదయం 8 గంటలకు అమ్మవారు స్వామివార్లకు పంచామృత అభిషేకాలు నిర్వహించి పల్లకి సేవ చేపట్టనున్నట్లు తెలిపారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు కావమ్మ మారే ఎలా దివ్య కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 16, 17 తేదీల్లో ఉదయం 8 గంటలకు పంచామృత అభిషేకం, 10 గంటలకు గ్రామోత్సవం, సాయంత్రం 6 గంటలకు సారే కుంకుమ పసుపు అందజేత కార్యక్రమాలు, 20, 21 తేదీల్లో ఉదయం పంచామృత అభిషేకాలు, గ్రామోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 22వ తేదీన ఆలయ వద్ద మహా అన్నదానంతో తీర్థ ఉత్స వాలు ముగించనున్నట్టు వారు తెలిపారు. సామర్ల కోట పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఉత్సవాల్లో పాల్గొని కావమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందాలని, ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసామని ఆలయ కమిటీ నాయకులు తెలిపారు.

# ఘనంగా కాకినాడ రూరల్ మీడియా హౌస్ లోగో ఆవిష్కరణ



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ పరిధిలో నూతనంగా ఏర్పాటైన "కాకినాడ రూరల్ మీడియా హౌసు రిజిస్టర్డ్ బాడీ లోగోను రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఘనంగా ఆవిష్కరించారు. స్థానిక ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. లోగో ఆవిష్కరణ అనంతరం ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ ప్రజలకు - ప్రభుత్వానికి మధ్య మీడియా ఒక దృఢమైన వారధిలా ఉండాలని పేర్కొన్నారు. రూరల్ ప్రాంత సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఈ మీడియా హౌస్ కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షంచారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విలువలతో కూడిన జర్నలిజం సమాజానికి అత్యంత అవసరమని, నూతనంగా ప్రారంభమైన ఈ సంస్థ ప్రజలకు దగ్గరగా ఉండే సేవలు అందించాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, రూరల్ ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మ, జనసేన నాయకులు తాటికాయల బుజ్జి, గేదెలు చిన్నారావు, టిడిపి నాయకులు కాళ్ల శ్రీనివాస్, రాయుడు అనీల్ తదితర రాజకీయ నేతలు, మీడియా ప్రతినిధులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సప్లయర్స్ యూనియన్ అధ్యక్షుడిగా మంచెం సాయి ఏకగ్రీవం

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్ల కోట మండల సప్లయర్స్ కంపెనీ యూనియన్ నూతన అధ్యక్షుడిగా సామర్లకోటకు చెందిన మంచెం సాయిబాబు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గురువారం సామర్లకోటలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు సిరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఎన్నికలో కార్యదర్శిగా పిల్లాడి రంగారావు, కోశాధికారిగా తిరుమల శెట్టి బాబ్జి, మరో 9 మంది కార్యవర్గ సభ్యులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు సాయిబాబు మాట్లాడుతూ ఆధునిక విధానాలతో, ప్రజలకు మంచి సామాగ్రిని అందిస్తూ, వ్యాపార పరంగా కాకుండా సామాజిక బాధ్యతగా సేవలు అందిస్తామని తెలిపారు. నూతన కార్యవర్గాన్ని పలువురు ప్రముఖులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అందరు సప్లై కంపెనీల యజమానులు పాల్గొన్నారు.

# బాలీవుడ్ ప్రయాణం వర్కౌట్ అవుతుందా?



పాన్ ఇండియా సినిమా ట్రెండ్ మొదలైన తర్వాత చాలా మంది ప్రాంతీయంగా సినిమాలను తెరకెక్కిస్తూ.. వాటిని ఇతర భాషలలో డబ్ చేస్తూ ప్రేక్షకుల ఆదరణ పొందే ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. ఇకపోతే ఈ మధ్యకాలంలో ప్రాంతీయంగా సినిమాలు చేసి విడుదల చేసిన తర్వాత.. అక్కడ సినిమాకి ఆడియన్స్ నుంచి వచ్చిన స్పందనను చూసి ఆ తర్వాతే మిగతా భాషలలో డబ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా గత కొన్ని సంవత్సరాలుగా సరైన సక్సెస్ కోసం ఎదురు చూస్తున్న ప్రముఖ స్టార్ కిడ్ ఆది సాయికుమార్ తాజాగా శంభాల అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. 2025 డిసెంబర్ 25 క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. పీరియాడికల్ స్పోర్ట్స్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రాన్ని షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నమోజు, మహీధర్ రెడ్డి నిర్మించారు. ఆది సాయికుమార్ హీరోగా, అర్చన అయ్యర్, రవి వర్మ, స్వాసిక తదితరులు కీలకపాత్రలు పోషించారు. అలా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాతో ఆది తెలుగులో మంచి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇకపోతే వరుస పరాజయాలతో ప్రేక్షకులను మెప్పించలేకపోయిన ఆది సాయికుమార్ ఇప్పుడు తెలుగులో మంచి విజయం అందుకొని.. ఇప్పుడు హిందీ మార్కెట్లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమయ్యారు. అందులో భాగంగానే ఈరోజు అనగా జనవరి 9న ఈ సినిమా హిందీలో డబ్బింగ్ వెర్షన్ విడుదల అయింది. ఆసక్తికరమైన నేపథ్యం, అద్భుతమైన ప్రదర్శనలతో హిందీ వెర్షన్‌పై అంచనాలు పెంచేసిన ఈ సినిమా.. అక్కడ ఎలాంటి విజయాన్ని అందుకుంటుంది అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ఈరోజు ప్రభాస్ ది రాజాసాబ్ సినిమా ఏకంగా పాన్ ఇండియా భాషల్లో విడుదలైంది. రెబల్ స్టార్ ప్రభాస్‌కి పాన్ ఇండియా వైడ్ మంచి మార్కెట్ ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు ఈ సినిమాకి పోటీగా శంభాల హిందీలో రిలీజ్ అయింది. మరి రాజాసాబ్ పోటీని ఎదుర్కోవడం అత్యంత సవాలుగా మారిన విషయం ఇది. పైగా ఇటు తెలుగులో ది రాజాసాబ్ మిక్స్ టాక్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఈ శంభాల సినిమా అటు హిందీ ఆడియన్స్‌కి కనెక్ట్ అవుతుందా లేదా అనే విషయంపై ట్రేడ్ వర్గాలు ఆసక్తి చూపిస్తున్నాయి.

మరి భారీ అంచనాల మధ్య తన సినిమాను హిందీలో డబ్ చేసి విడుదల చేసి మార్కెట్ పెంచు కోవాలని చూస్తున్న ఆది సాయి కుమార్‌కి ఈ సినిమా అక్కడ ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి. ప్రముఖ సీని యర్ సినీ నటుడు సాయికుమార్ వారసుడిగా సినీ ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టిన ఆది సాయికుమార్ 2011లో ప్రేమ కావాలి అనే చిత్రంతో ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. ఈ సినిమాతో ఉత్తమ నటుడు విభాగంలో సౌత్ ఫిలింఫేర్ అవార్డు దక్కించుకున్న ఈయన.. సైమా ఉత్తమ తెలుగు నటుడిగా కూడా అవార్డు లభించింది. ఆ తర్వాత లవ్లీ, సుకుమారుడు, శమంతకమణి వంటి చిత్రాలలో నటించారు.

# రికార్డు సృష్టించిన రాయా.. 24 గంటల్లోనే..



క్రిటికల్ సినిమాలతో అంతర్జాతీయ స్థాయిలో భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న లేడీ డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ తాజాగా తొలిసారి కమర్షియల్ సినిమా చేస్తోంది. అదే టాక్సిక్. ఈ చిత్రంలో కేజిఎఫ్ 1 & 2 చిత్రాలతో పాన్ ఇండియా స్థాయి గుర్తింపును సొంతం చేసుకున్న యష్ హీరోగా నటిస్తున్నారు. ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ హీరోయిన్గా నటిస్తోంది. ఇప్పటికే ఇందులో నటిస్తున్న నటీనటుల పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్లను విడుదల చేస్తూ సినిమాపై అంచనాలు పెంచిన విషయం తెలిసిందే. అయితే నిన్న హీరో యష్ పుట్టినరోజు కావడంతో ఈ సందర్భంగా ఆయన పాత్రను రివీల్ చేస్తూ ఒక చిన్న వీడియోని మేకర్స్ విడుదల చేశారు. అలా టాక్సిక్ మూవీ నుంచి వచ్చిన హీరో ఇంట్రడక్షన్ వీడియో సోషల్ మీడియాను ఇప్పుడు షేక్ చేస్తోంది. వీడియో వచ్చిన 24 గంటల్లోనే ఏకంగా 200 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించడమే కాకుండా 5.5 మిలియన్లకు పైగా లైక్స్ సాధించినట్లు మేకర్స్ అధికారికంగా పోస్టర్‌తో సహా విడుదల చేశారు. 2:52 నిమిషాల నిడివి ఉన్న ఈ యాక్షన్ సీన్ ఆకట్టుకుంది అంటూ కామెంట్లు చేస్తున్నారు.. ముఖ్యంగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ గ్యాంగ్స్టర్ డ్రామా నుండి విడుదల చేసిన ఈ వీడియో సినిమాపై అంచనాలు పెంచడమే కాకుండా మరొకసారి గీతూ మోహన్ దాస్ దర్శకత్వ విలువలు తెలుస్తున్నాయి అంటూ తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. మార్చ్ 19వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా పాన్ ఇండియా భాషలైన కన్నడ, తెలుగు, తమిళ్, మలయాళం, హిందీతో పాటు ఇంగ్లీష్‌లో కూడా విడుదల కాబోతోంది. ఇక నిన్న విడుదల చేసిన ఈ వీడియోని కూడా ఇంగ్లీషులో రిలీజ్ చేయడం గమనార్హం. మొత్తానికైతే యష్ ఇందులో ఆడియన్స్‌కి కావలసిన ఫుల్ మాస్ యాక్షన్ పెర్ఫార్మన్స్‌తో ఆకట్టుకోబోతున్నారని నేటిజన్స్ అభిప్రాయపడుతున్నారు. టాక్సిక్ సినిమా విషయానికి వస్తే.. ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్ అని ట్యాగ్ లైన్‌తో గ్యాంగ్స్టర్ యాక్షన్ థ్రిల్లర్ మూవీగా రాబోతోంది. నయనతార, హుమా ఖురేషి, రుక్మిణి వసంత్, తారా సుతారియా, కియారా అద్వానీ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట కే నారాయణ, యష్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇందులో రాయా అనే పాత్రలో హీరో నటిస్తున్నట్లు నిన్న ప్రకటించారు. మెల్లిసాగా రుక్మిణి వసంత్, నదియా పాత్రలో కియారా అద్వానీ, గంగా పాత్రలో నయనతార, రెబెక్క పాత్రలో తారా సుతారియా నటిస్తున్నట్లు వెల్లడించారు. ఇక వీరితోపాటు అక్షయ్ ఒబెరాయ్, నటాలీ బర్న్, ఉదయ్ కుమార్ రెడ్డి, కైల్ పాల్, టోవినో థమస్, అమిత్ తివారీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# హారర్ వరల్డ్‌లోకి స్టార్ డైరెక్టర్ సతీమణి




బాలీవుడ్ నటి యామీ గౌతమ్ ఓవైపు కుటుంబ బాధ్యతలు నెరవర్తిస్తూనే నటిగానూ బిజీగా గడుపుతోంది. ధాంపత్య జీవితం తర్వాత కథల విషయంలో మరింత సెలక్టివ్‌గా ఉంటుంది. యామీ గౌతమ్ తొలి నుంచి గ్లామర్ పాత్రలకు దూరంగానే ఉంది. అవకాశాలు రాలేదనో? లేక తగ్గాయనో? ఏ రోజు తాను మాత్రం ఎక్కడా వెనకడుగు వేయలేదు. పరిమితులకు లోబడే పనిచేసింది. వివాహం తర్వాత మరింత కేర్‌ఫుల్‌గా కథల్ని ఎంచుకుంటోంది. ఇటీవలే రిలీజ్ అయిన 'హక్'తో విమర్శకుల ప్రశంసలందుకుంది. న్యాయం కోసం పోరాటం చేసే మహిళ పాత్రలో ప్రేక్షకుల్ని ఆటకట్టుకుంది. అంతకుముందు నెట్ ఫ్లిక్స్‌లో రిలీజ్ అయిన 'దూమ్ ధామ్' తోనూ బాగానే అలరించింది. 'ఆర్టికల్ 370' తోనూ నటిగా మంచి గుర్తింపును దక్కించుకుంది. ఇలా వైవిధ్యమైన పాత్రలతో బాలీవుడ్‌లో ప్రత్యేక నటిగా హైలైట్ అవుతోంది. త్వరలో రిలీజ్ అవుతోన్న 'ధురంధర్ 2' లో కూడా యామీ నటిస్తుందనే ప్రచారం జరుగుతోంది. ఇటీవలే రిలీజ్ అయిన 'ధురంధర్' 1200 కోట్ల వసూళ్లు సాధించడంతో పార్ట్ 2 పై అంచనాలు ఆకాశన్నంటుతున్నాయి. ఇందులో యామీ గౌతమ్ భాగమైతే ఆమె కెరీర్‌కి మరింత కలిసొస్తుందని అంచనాలు తెరపైకి వస్తున్నాయి. ఇదే గెస్సింగ్ నడుమ యామీ గౌతమ్ హారర్ వరల్డ్‌లోకి అడుగు పెట్టడానికి రెడీ అవుతోంది. దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్ నిర్మిస్తోన్న 'నయి నవేలీ' అనే హారర్ చిత్రంలో యామీ గౌతమ్‌ని మెయిన్ లీడ్‌కి ఎంపిక చేసినట్లు సమాచారం. ఈ చిత్రానికి బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు.

ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శర వేగంగా జరుగుతున్నాయి. వీటిని పూర్తి చేసి ఫిబ్రవరి నుంచి రెగ్యులర్ షూటింగ్‌కి వెళ్లాలని సన్నాహాలు చేస్తున్నారు. ఈజానర్లో యామీ గౌతమ్ ఇంత వరకూ సినిమాలు చేయలేదు. కెరీర్‌లో ఎన్నో సాహసోపేతమైన పాత్రలు పోషిం చింది. కమర్షియల్ చిత్రాల్లోనూ నటించింది. కానీ కమర్షియల్ పాత్రలకంటే వైవిధ్యమైన పాత్రలే యామీ గౌతమ్‌కు ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చాయి. తొలిసారి హారర్ వరల్డ్‌లోకి అడుగు పెడుతోన్న నేపథ్యంలో అక్కడా అమ్మడు తనదైన ముద్ర వేస్తుందా? లేదా? అన్నది చూడాలి. ఇప్పటికే ఈ జానర్లో శ్రద్ధాకపూర్ బ్రాండ్ అంబాసిడర్‌గా ముద్ర వేసుకుని సత్తా చాటుతోంది. కపూర్ బ్యూటీ ఎదురే లేకుండా దూసుకుపోతుంది. అడపా దడపా కరీనా కపూర్ కూడా ఈజానర్లో సినిమాలు చేస్తోంది. యామీ గౌతమ్ కూడా ఎంటర్ అవ్వడంతో భవిష్యత్‌లో ఆ ముగ్గురి మధ్య కొంత పోటీకి అవకాశమైతే ఉంది.

# వారసులే కాదు.. వారసురాళ్లు కూడా!





టాలీవుడ్‌లో వారసత్వం అంటే తండ్రి నుంచి తనయుడు వారసత్వాన్ని అందుకోవడమే. మేల్ డామినేషన్ మాత్రమే ఎక్కువగా కనిపించేది. కానీ ఇప్పుడు బాలీవుడ్ తరహాలో టాలీవుడ్‌లోనూ సన్నివేశాలు మారాయి. హిందీ పరిశ్రమ తరహాలో టాలీవుడ్ నుంచి కుమార్తెలు రంగంలోకి దిగుతున్నారు. నచ్చిన శాఖ వైపు వెళ్లడానికి ఎంత మాత్రం వెనకడుగు వేయడం లేదు. ధైర్యంగా ముందుకొచ్చి 24 శాఖల్లో నచ్చిన శాఖను ఎంచుకుంటున్నారు. ఒకప్పుడు నిర్ణయం తీసుకోవడానికే ఎంతో ఆలోచించేవారు. కానీ ఇప్పుడా నిర్ణయం గంటల్లో జరిగిపోతుంది. టాలీవుడ్‌లో ఆ ఐదేళ్ల కాలంలో వచ్చిన ప్రధాన మార్పు ఇది. ఇప్పటికే మెగా కుటుంబం నుంచి నాగబాబు తనయ నిహారిక నటిగా, నిర్మాతగా రాణిస్తున్నారు. క్రియేటివ్ విభాగంలోనూ ఇన్వాల్వ్ అవుతుంటారు. ఇప్పుడు అదే కుటుంబం నుంచి మెగాస్టార్ చిరంజీవి పెద్ద కుమార్తె సుస్మిత కూడా నిర్మాతగా (మనశంకర వరప్రసాద్) ఎంట్రీ ఇచ్చారు. ఇప్పటి వరకూ కెమెరా వెనుక కాస్ట్యూమ్ డిజైనర్ గానే కొనసాగిన సుస్మిత నిర్మాతగా ఎంట్రీ ఇవ్వడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రత్యేకించి చిరంజీవి ఎంతో గర్విస్తున్నారు. ఫ్యాషన్ ఉన్న వారు నిర్మాణం సహా నచ్చిన శాఖను ఎంచుకుని ప్రతిభను నిరూపించుకోవాలని ఆకాంక్షించారు. అలాగే నటసింహ బాలకృష్ణ రెండవ కుమార్తె తేజస్విని కూడా నిర్మాణ రంగంలోకి ఎంటర్ అవుతున్నారు. బాలయ్య 111వ చిత్రాన్ని తానే స్వయంగా నిర్మిస్తున్నారు. ఈ విషయంలో తండ్రి నుంచి అన్ని రకాల సహకారం తేజస్వికి దక్కుతోంది. త్వరలోనే ఈసిసనిమా ప్రారంభం కానుంది. భవిష్యత్‌లో సుస్మిత-తేజస్విని నిర్మాతలుగా పోటీ పడే అవకాశం లేకపోలేదు. ఒకప్పుడు చిరంజీవి-బాలయ్య సినిమాల మధ్య ఎలాంటి పోటీ వాతావరణం ఉండేదో? భవిష్యత్‌లో అలాంటి పోటీ సుస్మిత-తేజస్వి మధ్య ఉండే ఛాన్స్ ఉంది.

ఇప్పటికే స్టార్ ప్రొడ్యూసర్ అశ్వీనీదత్ వారస త్వాన్ని ఇద్దరు కుమార్తెలు స్వప్న, ప్రియాంక దత్‌లు దిగ్వి జయంగా ముందుకు తీసుకెళ్తున్నారు. విజయవంతమైన చిత్రాలతో నిర్మాతలుగా తమ అభిరుచిని చాటుకుంటున్నారు. భవిష్యత్‌లో మరింత మంది వారసురాళ్లు రావడం ఖాయం. నిర్మాణం కంటే హీరోయిన్లగా ఎంట్రీ ఇవ్వడానికే అవకాశాలు న్నాయి. సూపర్ స్టార్ మహేష్ ముద్దుల కుమార్తె సితార హీరోయిన్ అవ్వడానికి ఛాన్సెస్ ఉన్నాయి. ఇప్పటికే సినిమాల పట్ల తన ఫ్యాషన్‌ని ప్రూవ్ చేసుకుంటోంది. తనయుడు గౌతమ్ వస్తాడా? రాడా? అన్నది పక్కనబెడితే సితార మాత్రం మామ్ -డాడ్‌లను ఒప్పించి మ్యాకప్ వేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వీరందరికంటే ముందే సూపర్ స్టార్ కృష్ణ కుమార్తె మంజుల కూడా చిత్ర రంగంలో తనదైన ముద్ర వేసిన సంగతి తెలిసిందే.

# నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బాల సుధాకర్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని మాజీ ముఖ్య మంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి నివాసం నందు జనార్దన్ రెడ్డి కుమారుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి జన్మదిన సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన నెల్లూరులోని ఇందిరా భవన్ ఇంచార్జ్ ట్రస్టీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, పిసిసి మెంబర్ తలారి బాల సుధాకర్, ఈ సందర్భంగా బాల సుధాకర్ ఆధ్వర్యంలో సాల్వేషన్ ఆర్మీ చర్చి నందు రామ్ కుమార్ రెడ్డి పేరు మీద దైవ సేవకులు ప్రార్థనలు నిర్వహించారు. రామ్ కుమార్ రెడ్డి మరిన్ని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆ దేవునికి ప్రార్ధనలు నిర్వహించారు. తదనంతరం పేదలకు చీరలు దుప్పట్ల పంపిణీ నిర్వహించారు.

# రైతు సంక్షమమే కూటమి ప్రభుత్వ విధానం

**- బుచ్చిరెడ్డి పాళెం మండలంలో రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణి - ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నాను - పట్టాదార్ పాస్ పుస్తకాలతో రైతుల భూములకు భద్రత - పట్టాదార్ పాస్ బుక్ పై గల క్యు ఆర్ కోడ్ స్కాన్ చేసి భూమి వివారాలు తెలుసుకోవచ్చు - దశాబ్దాల తరబడి పూడికలు తీయని కాలువలను బాగు చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించాం - గతమెన్నడు లేనివిధంగా గిట్టుబాటు ధర కల్పించి, ధాన్య సేకరణ చేసిన 24 గంటలలో రైతుల ఖాతాలలో డబ్బులు వేసాం - మూడు విడతలుగా 7 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణి చేసి సన్నకారు రైతులను ఆదుకున్నాం - 80 లక్షలతో లేగుంటపాడు జమ్మిపాలం లింక్ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తాం - 36 లక్షలతో లేగుంటపాడులో విలేజ్ హెల్త్ సెంటర్ నిర్మాణం చేపట్టబోతున్నాం : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రాష్ట ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందచేసి ఎన్నికల నాటి హామీని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు అమలు చేశారన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందచేసే కార్యక్రమంలో భాగంగా కోవూరు మండలం లేగుంటపాడు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి స్థానిక టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. కోవూరు మండలానికి సంబంధించి 2 వేల 424 పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ తాను ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు వెల్లడించారు. గత ప్రభుత్వం అన్నదాతల పాలిట శాపంగా తీసుకు వచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రాష్ట ప్రభుత్వ రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాలతో రైతుల భూములకు సిఎం చంద్రబాబు నాయుడు రైతుల భూములకు భద్రత కల్పించారన్నారు. అత్యాధునిక సాంకేతికతో రూపొందించిన పట్టాదార్ పాస్ బుక్‌పై గల క్యు ఆర్ కోడ్ స్కాన్ చేసి భూమి వివారాలు తెలుసుకోవచ్చని సర్వే నెంబర్లు, పేర్లలో ఏవైనా పొరపాట్లు దొర్లి వుంటే సరిదిద్దుకోవచ్చు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక దశాబ్దాల తరబడి పూడికలు తీయని కాలువలను కొన్ని ప్రభుత్వ పరంగాను మరికొన్ని విపిఆర్ ఫౌండేషన్ ద్వారా బాగు చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించామన్నారు. గతమెన్నడు లేనివిధంగా గిట్టు బాటు ధర కల్పించి, ధాన్య సేకరణ చేసిన 24 గంటలలో రైతుల ఖాతాలలో హమాలీ కూలీలతో సహా వేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. మూడు విడతలుగా 7 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణి చేసి సన్నకారు రైతులను ఆదుకున్నా మన్నారు. రైతుల అవసరాలను గుర్తించి యూరియా పంపిణి చేయడంలో వ్యవసాయశాఖ అధికారులు చూపిస్తున్న చొరవను ఆమె అభినందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 20 నెలల కాలంలో అమలు చేసిన అన్నదాత సుఖీభవ, తల్లికివందనం, మత్స్యకార భరోసా, స్త్రీశక్తి తదితర సంక్షమ పథకాల గురించి ఆమె ప్రజలకు వివరించారు. గత ఐదేళ్లలో తట్టెడు మట్టికి నోచుకోని గ్రామీణ ప్రాంత రోడ్ల దుస్థితికి నేటికీ ఎంతో మార్పు వుందన్నారు. కూటమి ప్రభుత్వ 19 నెలల పాలనలో 14 లక్షలతో సిసి రెండు సిసి రోడ్ల నిర్మాణం పూర్తయిందని 32 లక్షలతో తాగునీటి అవసరాల కోసం నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ నిర్మాణ దశలో ఉందన్నారు. 80 లక్షలతో లేగుంటపాడు జమ్మిపాలం లింక్ రోడ్డు నిర్మాణం, 36 లక్షలతో లేగుంటపాడులో విలేజ్ హెల్త్ సెంటర్ నిర్మాణాలు త్వరలోనే చేపట్టబోతున్నామన్నారు. 65 లక్షలతో 15 వ ఆర్థిక సంఘు, ఎంపి లాడ్స్, జాతీయ ఉపాధి హామీ నిధులతో చేస్తున్న రోడ్లు, కల్వర్టులు మరియు డ్రైన్ల నిర్మాణాలు చేపట్టబోతున్నట్టు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రకటించారు.


ఈ కార్యక్రమంలో కోవూరు తహసీల్దారు వెంకట సుబ్బయ్య, పెన్నాడెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాలరెడ్డి, జొన్నవాడ ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్ రెడ్డి, ఎంపీపీ తుమ్మల పార్వతిలతో పాటు సర్పంచ్లు, ఎంపీటీసీలు స్థానిక టిడిపి యూనిట్, క్లస్టర్, బూత్ కమిటీ ఇంచార్జీలు పాల్గొన్నారు.

# జిల్లాలో జంతు హింస జరగకూడదు : కలెక్టర్ శుక్లా





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లాలో కోడిపందాలు జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరు క్యాంపు కార్యాలయంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా జంతు హింస నివారణ కార్యవర్గ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడిపందాలు, ఎడ్లపందాలను పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. జంతువులను హింసకు గురిచేసే విధంగా ఏ విధమైన పోటీలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్థాయి, మండలస్థాయి, డివిజనల్ స్థాయిలో రెవెన్యూ, పోలీసులతో బృందాలను ఏర్పాటుచేసి జాయింట్‌గా తనిఖీలు నిర్వహించాలన్నారు. కోడి పందాలు నిర్వహించే ప్రదేశాలను ముందుగా గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా కోడిపందాలను ప్రోత్సహించినా, నిర్వహించినా గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయాలని ఏఎస్పీకి సూచించారు. పల్లెల్లో ఎటువంటి ఘర్షణలకు తావు



లేకుండా సంక్రాంతి పండుగను ప్రశాంతంగా నిర్వహించుకునేలా చూడాలన్నారు. అనంతరం కోడిపందాలు అరికట్టేందుకు అవగాహన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్ నాయక్, ఏఎస్పీ సిహెచ్ సౌజన్య, డిఆర్ఓ విజయ్ కుమార్, కమిషనర్ నందన్, జడ్పీ సిఇవో శ్రీధర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వసుమతి, ఐఅండ్ పిఆర్ డిడి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వేద హాస్పటల్స్ ప్రారంభం









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రూరల్ నరకూరు గౌడ్ హొటల్ పక్కన నరుకూరు సెంటర్‌నందు వేద హాస్పటల్ ట్రూత్ వివేకానంద ట్రస్ట్ వ్యవస్థాపకులు విజయవాడ వివేకానంద చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేద హాస్పటల్ ఒక అద్భుతమైన హాస్పటల్ ఈరోజు ప్రారంభించుకోవడం ఎంతో సంతోషదాయకం డాక్టర్ వీరశేఖర్ వీరి వద్ద రెండు మూడు సంవత్సరాలుగా వ్యక్తిగతంగా నేను లబ్ధి పొందాను మా ఫ్యామిలీకి ఎంతో అద్భుతంగా ట్రీట్మెంట్ చేశారు కొన్ని కొన్ని సమస్యలకు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కూడా అందని వైద్యం ఈ డాక్టర్ దగ్గర చాలా సులభతరంగా తక్కువ ఖర్చుతో ట్రీట్మెంట్ చేశారు వ్యక్తిగతంగా అందుకు నేనే ఆ ఎవిడెన్స్ ప్రాబ్లం ఎక్కడుందో అది వెతికి పట్టుకుని దానికి చక్కటి పరిష్కారం వైద్యం చేయగల నిపుణులు ఆయన నేను ఇక్కడికి రావడం నా అదృష్టం నరుకూరు ప్రజలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వేద హాస్పటల్‌ను సద్వినియోగం చేసుకుని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బద్రి వీరశేఖర రావు, డాక్టర్ మహాలక్ష్మిదేవి, స్నేహితులు బంధువులు శ్రేయోభిలాషులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కాకినాడలో ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రి త్వరలో వినియోగంలోకి : సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు





**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ నగరంలో నిర్మితమైన ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రిని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రభుత్వం ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. గురువారం ఆయన కాకినాడ నగరంలోని జిపిటి సముదాయం వెనుక భాగంలో సుమారు రూ.15 కోట్ల వ్యయంతో నిర్మించిన 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రి భవనాన్ని సందర్శించారు. నిర్మాణం పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు ఈ ఆసుపత్రిని అధికారికంగా స్వీకరించకపోవడంపై అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. బిల్డింగ్ హ్యాండోవర్ ప్రక్రియ పూర్తి కాకపోవడం, డాక్టర్లు మరియు సిబ్బంది నియామకాలు జరగకపోవడం వంటి అంశాలను ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ భవనం నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో అవసరమైన వైద్య పరికరాలు, డాక్టర్లు, సిబ్బంది నియామకాలను పూర్తి చేసి త్వరలోనే ఆయుష్ ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని స్పష్టం చేశారు. అనంతరం ఆయన గర్ల్స్ పాలిటెక్నిక్ వసతి గృహాన్ని కూడా సందర్శించారు. అక్కడ నివసిస్తున్న విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్లు, లైబ్రరీ, క్రీడా సామగ్రి అవసరమని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే హాస్టల్‌కు వెళ్లేందుకు సరైన రహదారి, వీధి లైట్ల లేమి కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ముఖ్యంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వసతి గృహాల్లోని మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. విద్యార్థినుల సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ రత్నరాజు, జిల్లా ఆయుష్ అధికారి సహజద్ అలీ, జిపిటి ప్రిన్సిపాల్ సుజాత, ఇంచార్జి ప్రిన్సిపాల్ బాల నాగవేణి, ఫిజికల్ డైరెక్టర్ కమల్ భాష, సివిల్ హెడ్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితో పోలంరెడ్డి దినేష్ రెడ్డి భేటి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని ఎపి ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియ చేసారు. నెల్లూరు నగరం మాగుంట లేఔట్‌లోని ఆమె నివాసంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని కలిసి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై వారు చర్చించుకున్నారు.

# రైతులు కోసమే కూటమి ప్రభుత్వం : ధూళిపూడి వెంకటరమణ



**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ రైతుసేవా కేంద్రం 2 లో రైతులకి యూరియా పంపిణీ కార్యక్రమంలో తాళ్ళరేవు మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ (బాబి) హాజరై కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రైతులకి అన్ని రకాలుగా మేలు చేశారన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గం శాసనసభ్యులు సహకారంతో నీటి సంఘాలు పని తీరు వలన రైతులు సాగునీరు కోసం ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేశారన్నారు. రైతుసేవా కేంద్రంలో రైతులకు కావలసిన అన్నిరకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయి అని రైతులు అందరు యూనిటీగా ఉండి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూరంపూడి సూరిబాబు, భైరవమూర్తి, కాకర్లపూడి రాజులు, వర్మ, వీరబాబు, సుధాకర్, శ్రీను, వెంకటపతిరాజు, వ్యవసాయ సిబ్బంది తేజేశ్వరి, ప్రియాంక, కాద దుర్గ తదితరులు పాల్గొన్నారు, ముమ్మిడివరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెచ్చెట్టి శ్రీలక్ష్మ శ్రీనివాస్, గౌతం, పంపన పాండురంగ, మొగలతుర్తి శ్రీను పాల్గొన్నారు.

# కందాడ దళిత రైతుల సాగులో వున్న భూమిని యధావిధిగా కేటాయించాలి




**తిరుపతి, (రాజధాని వార్తలు):** ఏర్పేడు మండలంలోని కందాడ దళిత రైతుల సాగులో వున్న భూమిని యధావిధిగా దళితులకే కేటాయించాలని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అనుచరుల నుంచి దళిత కుటుంబాలకు ప్రాణహాని వుందని, ఎస్సీ- ఎస్టీ కమిషన్ పర్యటించి దళితులకు న్యాయం చేయాలని తిరుపతి జిల్లా ఆమ్ ఆద్మీ అధ్యక్షులు నీరుగట్టు నగేష్ కోరారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నీరుగట్టు నగేష్ ఆధ్వర్యంలో ఇదే విషయమై ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సమావేశంలో అయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్, ఏర్పేడు మండలం, కందాడ గ్రామంలో 1998 నుండి దళితులు గత 27 సంవత్సరాలుగా వర్షాధార పంటలతో పట్టాదార్ పాసుబుక్కులు కలిగి దట్టమైన అటవి వాతావరణం వలన స్థలాన్ని చదును చేసి, సాగు చేసుకుంటున్న భూములపై కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దేగకన్ను పడింది. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అనుచరులు దౌర్జన్యంగా ఈయొక్క దళితులను భూమి నుండి వెలి వేయాలని కుట్ర జరిగిందన్నారు. ఇందులో భాగంగా మాజీ సైనికుల కుటుంబీకులకు సర్వే నెం.406 నందు సబ్-డివిజన్, 519 (4) లో 0.99 సెంట్లు, 520/2లో 3.63 సెంట్లు మొత్తం కలిపి ఎ 4-62 సెంట్లు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఇచ్చారు. మాజీ సైనికులు కుటుంబాలకు భూమి కేటాయించడాన్ని మేము వ్యతిరేకించడం లేదన్నారు. అయితే దళితుల సాగులో పొడవాటి వేపచెట్లు, టేకు చెట్లు, బోరు, గుడిసె వంటి వాటిని నిర్మించుకొని సాగులో వున్న భూమిని ఇవ్వడం సమంజసం కాదని జిల్లా యంత్రాంగాన్ని కోరుచున్నామన్నారు. ఒకవేళ అదే భూమిని మాజీ సైనికులకు కేటాయించాల్సి వస్తే ఇరువర్గాలతో చర్చించి, న్యాయం చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులకు వుందన్నారు. ప్రస్తుతం మాజీ సైనికులకు కేటాయించిన ఎ 4.62 సెంట్లు కంటే దాదాపు 22.00 ఎకరాలు ఎక్కువగా అనగా 7.00 ఎకరాల వరకు పెన్సింగ్ వేయడం తగదన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు చొరవ చూపించి, దళిత రైతులు సాగులో వున్న భూమిని యధావిదిగా వారికే చెందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీన్ని రాజకీయం చేయాలని, కూటమి ప్రభుత్వం నేతలు కబ్జా చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అనుమానం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యాన్ని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుదీర్ రెడ్డికి తెలియజేయడానికి వెళ్ళగా బాధిత దళిత కుటుంబాలు ఆయన ఎదుట మొరపెట్టుకోగా ఆ భూమిపై కన్నేసిన కొంత మంది ఎమ్మెల్యే అనుచరులు బాధితుడు, పాత్రికేయుడు వెంకటేశులపై ఎమ్మెల్యే సమక్షంలోనే మీపై వార్తలు వ్రాస్తున్నారని తెలుగు దేశం పార్టీ మీడియా కో-ఆర్డినేటర్, శ్రీకాళహస్తి మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్ దురుసుగా వ్యవహరించడం చాలా బాధాకరం అన్నారు. తక్షణమే దళిత కుటుంబాలకు క్షమాపణ చెప్పాలని, లేనిఎడల దళిత కుటుంబాలు, ప్రజా సంఘాలు వివిధ రాజకీయ పార్టీలతో ఎస్సీ, ఎస్టీ కమిషన్, మానవ హక్కుల కమిషన్లకు ఫిర్యాదులు చేసి, న్యాయపోరాటం చేస్తామని తెలియజేశారు. ఇప్పటికైనా జిల్లా రెవెన్యూ అధికారులు చొరవ తీసుకొని దళితుల సాగులో వున్న భూమిని యధావిధిగా కొనసాగించుకొనేలా చేయాలని పత్రికాముఖంగా కోరుతున్నామన్నారు. లేని జూపక్షంలో పెద్దఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని తెలియజేశారు. ఈ సమావేశంలో బాధితులు గజ్జల కళావతి, చెంగ్రాయులు, చెన్నూరు వెంకటేశులు, సెల్వి ఎన్.ఎస్.ఎఫ్. రాష్ట్ర అధ్యక్షులు తలారి సూరిబాబు, రాయలసీమ అధ్యక్షులు భరత్ నాయక్, తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షులు పెనుబాకు కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# మౌర్య వైఖరికి వ్యతిరేకంగా నిరసన తెలిపిన మీడియా మిత్రులు

**తిరుపతి, (రాజధాని వార్తలు):** ప్రజాస్వామ్యానికి మీడియా నాల్గవ స్తంభంలాంటిదని, అలాంటి మీడియా పైన వీసి మౌర్య అనుచితంగా ప్రవర్తించడ తగదని తిరుపతి మీడియా మిత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తుడా కార్యాలయంలో 60 సంవత్సరాల పైబడిన వారు కూడా కొనసాగుతుండడం పైన హైకోర్టు మరియు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులపై వివరణ కోరడానికి తుడ ఇంచార్జి విసి మౌర్యాని కలిసిన ఏపిజేయఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దినేని హరిబాబు పట్ల చెప్పరాని విధంగా దురుసుగా ప్రవర్తించడంపై మీడియా మిత్రులు గురువారం తిరుపతి తుడా కార్యాలయం ముందు నిరసన తెలిపారు. వీసి మౌర్యకి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ సందర్భంగా మీడియా మిత్రులు మాట్లాడుతూ మీడియా ఏదైనా విషయంపై ధృవీకరణ కోసం సంబందిత అధికారులను కలిసి వివరణ కోరే హక్కు బాధ్యతలలో భాగమేనని తెలిపారు. అధికారులకు ఉన్నట్లు మీడియాకు కూడా బాధ్యతలు వుంటాయని, వాటిని నిర్వర్తించాల్సి వస్తుందని అధికారిగా వీసి మౌర్య గుర్తించకపోవటం విచారకరమన్నారు. ఇంచార్జి వీసిగా కాక, అధికార దర్పంతో హేళనగా మాట్లాడి అవమానపరచటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో ఎంతోమంది అదికారులు పనిచేసి వారి పదవికి వన్నెతెచ్చారని గుర్తు చేసారు. ఇలాంటి ఉన్నత స్థానంలో ఉంటున్న అధికారిణి అయిన మౌర్య మీడియా మిత్రులను తూలనాడుతూ మాట్లాడటం శోచనీయమన్నారు. అంతే కాక అధికారిగా ఆమె మాట్లాడిన మాటలకు, పశ్చాత్తాపడాల్సింది పోయి సామాజిక వర్గాల నుంచి ఫోన్లు చేయించి బెదిరింపులకు దిగటం ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభమైన మీడియాను భయపెట్టడానికి పూనుకోవటమేనని మీడియా భావిస్తున్నదన్నారు. తిరుపతి




జిల్లా ఇన్చార్జ్ జాయింట్ కలెక్టర్‌గా, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఇంచార్జ్ వైస్ చైర్మన్, స్మార్ట్ సిటీ చైర్మన్ నాలుగు పదవీ బాధ్యతలు బాధ్యతలు నిర్వహిస్తూ మీడియా పట్ల అంత దురుసుగా ప్రవర్తించటం ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. దీనికి సదరు అధికారిణి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇలాంటి అనుచిత ప్రవర్తన ఇకమీదట పునరావృతం కాకూడదన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర శాఖ తీసుకుని పోనున్నట్లు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దినేని హరిబాబు, తిరుపతి జిల్లా కన్వీనర్లు అరవ జయపాల్, గల్లా మహేష్, నెత్తం హరిబాబు, మహా టీవీ మోహన్, బిగ్ టీవీ దామోదర్ నాయుడు, సీనియర్ జర్నలిస్టులు రూప సుందర నాయుడు. సీనియర్ జర్నలిస్ట్ బాలయ్య, తదితరులు భారీ ఎత్తున పాల్గొని సంఘీభావం తెలియజేశారు.

# ఇచ్చిన డబ్బులు అడిగితేనే అక్రమ కేసులా?....నిర్మల ఆవేదన

**రేణిగుంట, (రాజధాని వార్తలు):** ఇచ్చిన డబ్బులు తిరిగి అడిగినందుకే తనపై దౌర్జన్యం చేసి అక్రమ కేసులు పెట్టించారని సీతారామపురం గ్రామానికి చెందిన నిర్మల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రేణిగుంట పట్టణంలోని రేణిగుంట ప్రెస్ క్లబ్ అసోసియేషన్లో ఆమె మీడియాతో మాట్లాడారు. ఆమె వివరాల ప్రకారం తారకరామ నగర్ సుందరయ్య కాలనీకి చెందిన దీపాకు, అదే గ్రామానికి చెందిన రాజశేఖర్ పూచితో దాదాపు మూడు సంవత్సరాల క్రితం రూ.10 లక్షలు నగదు ఇచ్చినట్టు తెలిపారు. ఆపదలో ఉన్నారని నమ్మి, కడుపు కట్టుకొని రూపాయి రూపాయి సంపాదించిన తన సొమ్మును ఇచ్చానని చెప్పారు. అయితే మూడు నెలలు మాత్రమే వడ్డీ ఇచ్చారని, తర్వాత అదిగో ఇదిగో అంటూ మాట దాటేస్తూ ఇప్పటివరకు ఏమి చెల్లించకపోవడంతో డబ్బులు అడగడానికి వెళ్లిన తనను అసభ్యకరంగా మాట్లాడటంతో పాటు దాడి చేశారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా తనపై అక్రమ కేసులు పెట్టించారని, "మేము సీపీఎం పార్టీలో ఉన్నాం నీ డబ్బులు ఒక్క రూపాయి కూడా ఇవ్వం, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో" అంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. తమ డబ్బులు ఇవ్వకూడదని ఫోన్లో పరస్పరం మాట్లాడుకున్న సంభాషణలకు సంబంధించిన ఆడియో ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. డబ్బులు అడిగినందుకే తనపై దాడి చేసి, పార్టీ పేర్లు చెప్పి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కన్నీటితో చెప్పారు. తనకు ఎవరూ లేరని, సొంత పిల్లలకు కూడా పెట్టుకోకుండా సంపాదించిన డబ్బులు ఇచ్చి మోసపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని తనకు న్యాయం చేయాలని ఆమె మీడియా ముఖంగా విజ్ఞప్తి చేశారు.




# సైబర్ నేరాల పట్ల అవగాహన అవసరం : సిఐ

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన అవసరమని సామర్లకోట సీఐ కృష్ణ భగవాన్ అన్నారు. స్థానిక గవర్నమెంట్ హైస్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం పలు విషయాలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మొబైల్ ద్వారానే సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతిక తను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలన్నారు.



ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో నేరస్థులను వేటాడిన నాలుగో సింహం

**- నేరస్థులు జిల్లాలో ఉండరు ఉంటే జైల్లో ఉంటారు అన్న ఎస్పి డాక్టర్ అజిత వాజెండ్ల నేరగాళ్లుపై ఉక్కుపాదం మోపుతున్నారు - నెల్లూరుకు పట్టిన నేర గ్రహ(ణం)లను వదలగొడుతున్న జిల్లా ఎస్పీ**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో జరిగిన పలు నేరాలు ఛేదించిన పోలీసులు...వివరాలు వెల్లడించిన ఎస్పీ అజిత వాజెండ్ల. కొడవలూరు మండలం కొత్త వంగల్లు గ్రామంలో వృద్ధ మహిళ హత్య కేసు ఛేదించిన కొడవలూరు పోలీసులు... నిందితుడు అదే గ్రామానికి చెందిన యువకుడు. నెల్లూరు నగరం రంగ నాయకులు పేట రైల్వే గేటు రైల్వే స్టేషన్ రోడ్డు సమీపంలో కర్ణాటక వ్యక్తి హత్య కేసు ఛేదించిన సంతపేట పోలీసులు 1.03.2024 న 5వ టవున్ పరిధిలో పొదలకూరు రోడ్‌లో అరవభూమి సుజన్ కృష్ణా రెడ్డి @ చింటు అనే (28) యువకుని హత్య కేసులో తప్పించుకు తిరుగుతున్న 6 మంది ముద్దాయిలను అరెస్ట్ చేసిన 5వ టవున్ పోలీసులు...2024లో సంచలనం సృష్టించిన ఈ హత్య కేసులో ముద్దాయిలు ఇన్ని రోజుల తర్వాత కటకటాలకు పంపిన పోలీసులు, ఈ కేసులో రాజకీయ అండదండలు ఓ ప్రజా ప్రతినిధి అండతో అప్పట్లో నేరస్థులు స్వేచ్ఛగా తిరిగారని ఇన్నాళ్ళకు నెల్లూరుకు పట్టిన నేర గ్రహణం వీడిందని జిల్లా ఎస్పీ అజిత దూకుడుతో పోలీసులు స్వేచ్ఛగా నేరగాళ్ల భరతం పడుతున్నారని జిల్లాలో శాంతిభద్రతలు కుదుట పడుతున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# మెడికవర్ హాస్పిటల్స్‌లో విజయవంతమైన కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కిడ్నీ వైఫల్యంతో బాధ పడుతున్న రోగికి నెల్లూరు మెడికవర్ హాస్పిటల్స్‌లో విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించబడింది. ఈ కీలక వైద్య విజయంపై వివరాలు తెలియజేయడానికి ఆసుపత్రిలో చికిత్స పొందిన రోగితో కలిసి ప్రత్యేకంగా ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య బృందం చికిత్సకు సంబంధించిన అంశాలను మీడియాకు వివరించినారు. పేషెంట్ గత కొన్ని సంవత్సరాలుగా దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో బాధపడుతూ, తరచూ డయాలిసిస్‌పై ఆధారపడాల్సిన పరిస్థితిలో ఉన్నారు. ఆరోగ్యం క్రమంగా క్షిణిస్తుండటంతో, వైద్యుల సూచన మేరకు కిడ్నీ మార్పిడి అవసరమైంది. మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరులోని అనుభవజ్ఞులైన నెఫ్రాలజీ, యూరాలజీ, ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీ, అనస్తీషియా మరియు క్రిటికల్ కేర్ విభాగాల సమన్వయంతో, అత్యాధునిక సదుపాయాల మధ్య శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి వేగంగా మెరుగుపడుతూ, ప్రస్తుతం పూర్తిగా కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరుకు చెందిన డాక్టర్ ఎమ్.వి.సురేష్ కుమార్ రెడ్డి సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలాజిస్ట్ & రీనల్ ట్రాన్స్ ప్లాంట్ ఫిజిషియన్ మాట్లాడుతూ, "కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స అనేది అత్యంత సున్నితమైన మరియు సంక్లిష్టమైన వైద్య ప్రక్రియ. సరైన డోనర్ ఎంపిక, శస్త్రచికిత్సకు ముందు సమగ్ర పరీక్షలు, అలాగే శస్త్రచికిత్స అనంతరం నిరంతర పర్యవేక్షణ చాలా కీలకం. ఈ కేసులో అన్ని విభాగాల వైద్యులు సమన్వయంతో పనిచేయడం వల్ల శస్త్రచికిత్స పూర్తిగా విజయవంతమైంది. కిడ్నీ మార్పిడి అనంతరం రోగి జీవన నాణ్యత గణనీయంగా మెరుగుపడుతుంది. నెల్లూరులోనే ఈ స్థాయి ట్రాన్స్‌ప్లాంట్ సేవలు అందించడం మా బృందానికి గర్వకారణం" అని తెలిపారు.

చికిత్స పొందిన రోగి పొంకం శ్రీనివాసులు (వయసు 34, గ్రామం సూళ్లూరుపేట) మాట్లాడుతూ "డయాలి సిస్‌తో జీవితం ఎంతో కష్టంగా మారింది. మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరులో వైద్యులపై పూర్తి నమ్మకంతో కిడ్నీ మార్పిడి చేయించు కున్నాను. ఈ రోజు నేను ఆరోగ్యంగా ఉన్నాను అంటే అది వైద్యుల అంకితభావం వల్లే. నాకు కొత్త జీవితం ఇచ్చిన వైద్యులు, నర్సులు మరియు ఆసుపత్రి సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞ తలు" అని అన్నారు. ఈ ప్రెస్ మీట్‌లో మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరు వైద్యులు, డా.జి.గోకుల్ నచికేత్ సీనియర్ కన్సల్టెంట్ యురాలజిస్ట్ మరియు ట్రాన్స్‌ప్లంట్ సర్జన్, డాక్టర్ శ్రీ రంగనాథ్, సీనియర్ కన్సల్టెంట్ అనస్థియాలాజిస్ట్, డాక్టర్ గౌతమ్ క్రిటేకల్ కేర్ స్పెషలిస్ట్, క్లస్టర్ హెడ్ జి.రంజిత్ రెడ్డి, సెంటర్ హెడ్ లావణ్య ఆసుపత్రి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ విజయవంతమైన కిడ్నీ మార్పిడి ద్వారా నెల్లూరు మరియు పరిసర జిల్లాల ప్రజలకు చెన్నై మరియు హైదరాబాద్ వంటి మెట్రో నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానికంగానే అత్యాధునిక కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యం పేర్కొన్నారు.

# యువతకు క్రీడా సామాగ్రి, దివ్యాంగుడికి ట్రైసైకిల్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

**- బుచ్చి మండల యువకులకు 30 క్రికెట్ కిట్లు, 15 వాలీబాల్ కిట్లు**

**- కొడవలూరు మండలం చంద్రశేఖర పురం వాసికి బ్యాటరి ట్రై సైకిల్ అందజేత**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** యువతలో క్రమశిక్షణకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. నెల్లూరు నగరం మాగుంట లేవుట్‌లోని ఆమె నివాసంలో వి పి ఆర్ ఫౌండేషన్ ద్వారా బుచ్చిరెడ్డి పాళెం మండల యువతకు 30 క్రికెట్ కిట్లు, 15 వాలీబాల్ కిట్లు మరియు కొడవలూరు మండలం చంద్రశేఖరపురం వాసికి బ్యాటరి ట్రై సైకిల్ అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతలో అద్భుతమైన ప్రతిభ దాగి ఉంటుందని వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే వారు జాతీయ స్థాయికి ఎదగగలరని ఆకాంక్షించారు. క్రీడాకారులకు ప్రోత్సాహం, క్రీడా మైదానాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఆమె తెలిపారు. స్పోర్ట్స్ కిట్లు అందుకున్న యువకులు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అంగ వైకల్యంతో నడవలేని తనకు బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్ అందించి జీవనోపాధికి దారి చూపారంటూ చంద్రశేఖర పురం గ్రామానికి చెందిన లాలం మాల్యాద్రి అనే దివ్యాంగుడు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి ధన్యవాదాలు తెలిపాడు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, బుచ్చి మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, మండల టిడిపి అధ్యక్షులు బెజవాడ జగదీష్, సాగునీటి సంఘం అధ్యక్షులు బత్తల హరికృష్ణ, జొన్నవాడ ఆలయ మాజీ ఛైర్మెన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, చేనేత సంఘం నాయకులు కె వి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయనిధి) చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీ హరీష్ బాలయోగి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ హరీష్ మాట్లాడుతూ, ఈ రోజు మొత్తం 27 మంది లబ్ధిదారులకు గాను రూ.29,12,420/- విలువైన సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. పేద ప్రజలు అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న ఈ ఆర్థిక సహాయం వారికి ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందని అన్నారు. ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని పనిచేస్తోందని, ఎవరికీ వైద్య చికిత్సలు అందకుండా ఉండకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం అందిస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ హరీష్ బాలయోగి సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

## - ఎ.పి.ఆర్.ఎస్.ఎ జిల్లా నూతన అధ్యక్షులుగా వి ఎస్ దివాకర్




**అమలాపురం, (రాజధాని వార్తలు):** అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం నిర్వహించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా వివిఎస్ దివాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ ఆర్ఎస్ఏ రాష్ట్ర సహా అధ్యక్షులు, కాకినాడ జిల్లా అధ్యక్షులు, పితాని త్రినాద హరరావు ఎన్నికల అధికారి సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 16 మంది కార్యవర్గ సభ్యుల ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా 16 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఇతర రెవిన్యూ ఉద్యోగులు నుండి ఏవిధమైన నామినేషన్లు దాఖలు చేయని కారణంగా నామినేషను వేసిన 16 మంది యునానిమస్‌గా ఎన్నికయ్యారు. వారిలో వి.ఎస్.దివాకర్ డిప్యూటి తహసిల్దార్ ఉప్పలగుప్తం - జిల్లా అధ్యక్షులు గాను, బి.మృత్యుంజయరావు తహసిల్దార్ రామచంద్రాపురం - అసోసియేట్ అధ్యక్షులు గాను, ఎ.సుబ్రమణ్యేశ్వరరావు, డిప్యూటి తహసిల్దార్ అల్లవరం - ఉపాధ్యక్షులు-1 గాను, వై.రాంబాబు, తహసిల్దారు కోతపేట ఉపాధ్యక్షులు-2 గాను, ఆర్.డి.ఆర్, సిహెచ్. మూర్తి డిప్యూటి తహసిల్దార్ ఆత్రేయపురం - ఉపాధ్యక్షులు-3, జి.లలిత ఆర్.ఎస్.డిటి., ఉప్పలగుప్తం - ఉపాధ్యక్షులు-4, డి. శ్రీనివాస్, డిప్యూటి తహసిల్దార్ అయినవిల్లి- కార్యదర్శి గాను, ఎం.డి. ఇబ్రహీం, ఎం.ఆర్.ఐ., మలికి పురం ఆర్గనైజింగ్ కార్యదర్శి గాను, పి.బి.వి.ఎస్. కిషోర్ సీనియర్ సహాయకులు, కలెక్టరు కార్యాలయము, బి.గోపాలకృష్ణ, డిప్యూటి తహసిల్దారు, ముమ్మిడివరం జాయింట్ కార్యదర్శి-1, కే.రత్నాకర బాబు, ఆర్.ఎస్.డిటి. అమలాపురం - జాయింట్ కార్యదర్శి-2, ఎం.హరిచంద్ర వరప్రసాద్, ఆర్.ఎస్. డిటి రామచంద్రాపురం, జాయింట్ కార్యదర్శి-3, సి హెచ్.వెంకట నారాయణ ఓ.ఎస్ ఆర్.డి.ఒ ఆఫీసు, అమలాపురం వారిని జాయింట్ కార్యదర్శి-4, సి.హెచ్. భాస్కర్, డిప్యూటి తహసిల్దార్ రాజోలు ట్రేజరర్గాను, కే. మురళీకృష్ణ ఆర్.ఎస్.డిటి, కే. గంగవరం - ఇసి.మెంబర్-1, జి.ఎస్.వి. బాల, సి.ఎస్. డి.టి., రాజోలు ఇసి.మెంబర్-1గా ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు సహృదయ వాతావరణంలో జరిగాయని ఎన్నికల అధికారి తెలియచేసినారు.

# పంచాయితీ పాలనపై క్షేత్రస్థాయి శిక్షణ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచాయతీరాజ్ వ్యవస్థ పని తీరుపై అవగాహన కల్పించేలా ఆ శాఖ ఉద్యోగులకు క్షత్రస్థాయి పర్యట నలు నిర్వహించారు. సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం పరిధిలోని 12 జిల్లాలకు చెందిన డిప్యూటీ ఎంపీడీవోలు, మండల పరిషత్ పరిపాలన అధికారులు శిక్షణ జరుగుతుండగా దానిలో భాగంగా 120 మంది అధికారులను నాలుగు బృందాలుగా విభజించి పలు గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. ప్రిన్సిపల్ కెఎన్వి ప్రసాదరావు నేతృత్వంలో రెండు రోజుల క్షేత్రస్థాయి పర్యటనలు గురువారం ప్రారంభించారు. మొదటి రోజు సామర్లకోట మండలం వేట్లపాలెం, పెద్దాపురం మండలం జి.రాగంపేట, కాకినాడ రూరల్ మండలం కొవ్వాడ, అనపర్తి మండలం రామవరం గ్రామ పంచాయతీలలో పరిపాలనను ఈ బృందాలు పరిశీలించాయి. ఈ అధికారులు రెండోరోజు ఆత్రేయపురం మండలం ర్యాలీ, ముమ్మిడివరం మండలం అనాతవరం, కిర్లంపూడి మండలం బూరుగుపూడి, గోకవరం గ్రామాల్లో పర్యటించనున్నట్టు చెప్పారు. ఆయా గ్రామాల్లోని పారిశుధ్యం, రికార్డుల నిర్వహణ, ఇతర కార్యక్రమాల అమలును ఈ బృందాలు పరిశీలిస్తున్నట్టు చెప్పారు. అలాగే సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణను బృందాలు పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో ఉప ప్రిన్సిపల్ జి. రమణ, డిడివో ఎస్ఎస్ శర్మ, ఎంపీడీవోలు శేషుబాబు, సుశీల తదితరులు పాల్గొన్నారు.

# కబడ్డీ రాష్ట్ర పోటీలకు జిల్లా పరిషత్ విద్యార్థినులు ఎంపిక



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల హెచ్ఎం ఆర్ విజయలక్ష్మి గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలుపుతూ పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం గ్రామంలో తాజాగా జరిగిన అంతర్ జిల్లాల బాలికల కబడ్డీ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా తొమ్మిదో తరగతికి చెందిన కే అరుణశ్రీ, ఐ గీతామాధురి, ఎనిమిదో తరగతికి చెందిన ఎం శృతిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. రాత్రి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను హెచ్ఎంతో పాటు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ నాయకులు అభినందించారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan